మంగళవారం
27-02-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 246
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

బ్రహ్మోస్ క్షిపణే మా ప్రధాన ఆయుధం: నేవీ చీఫ్

న్యూఢిల్లీ: భారత నౌకా దళానికి బ్రహ్మోస్ క్షిపణే ఇప్పుడు ప్రధాన ఆయుధం కానుందని నేవీ చీఫ్ అడ్మిరల్ ఆర్.హరికుమార్ తెలిపారు. సోమవారం పుణేలో జరిగిన డిఫెన్స్ ఎక్స్‌పోలో ముగింపు వేడుకల్లో ప్రసంగిస్తూ ఇతర దేశాల నుంచి సమకూర్చుకున్న పాతకాలపు క్షిపణి వ్యవస్థ స్థానంలో బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను తీసుకొచ్చామని, ఇదే ఇప్పుడు నావికాదళంలో ప్రధాన ఆయుధం కానున్నదన్నారు. ఈ క్షిపణి సామర్థ్యాలు, పరిధిని మెరుగు పరిచినందున పాతకాలపు క్షిపణి వ్యవస్థ స్థానంలో బ్రహ్మోస్‌ను స్థాపితం చేస్తున్నామని తెలిపారు. 'నిజం చెప్పాలంటే ఈ క్షిపణి ఇక దేశంలోనే తయారవుతుంది. ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదు' అని ఆయన పేర్కొన్నారు.

వైసీపీ ఆపరేషన్ ఆకర్ష్!

- టీడీపీ, జనసేన అసంతృప్తులకు గాలం
- అధిష్ఠానం నుంచి పార్టీ నేతలకు ఫోన్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
టీడీపీ, జనసేన కూటమి తొలి జాబితాలో టికెట్లు దక్కని వారిపై వైసీపీ 'ఆపరేషన్ ఆకర్ష్' పేరుతో దృష్టి పెట్టింది. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలకు అధిష్ఠానం నుంచి ఫోన్లు వెళ్లాయి. తాడేపల్లిలో మంగళవారం జరగబోయే వైసీపీ కీలక సమావేశానికి వారి పూర్తి వివరాలతో హాజరు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. టికెట్లు దక్కని అసంతృప్త, అసమ్మతి నేతలకు వ్యక్తిగతంగా ఎన్ని ఓట్లు ఉంటాయి, వారి బలాబలాలు, వారితో ఉన్న నేతల పరిస్థితి, పార్టీలోకి తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు లేని వారిని గుర్తించి పంపాలి అని సూచించినట్లు సమాచారం. టీడీపీ, జనసేన విడుదల చేసిన తొలి జాబితా అనంతరం రాష్ట్రంలో అనేక నియోజకవర్గాల్లో టికెట్లు దక్కక అటు టీడీపీలోను ఇటు జనసేనలోనూ నిరసనలు రేగాయి. ఎక్కడికక్కడే అధినేతల తీరును వ్యతిరేకిస్తూ నేతలు తిరుగుబావుటా ఎగురవేశారు. అనుచరులతో సమాలోచనలు నిర్వహించి, భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమయ్యారు. వారికి టీడీపీ, జనసేన నేతలు ఎంత బుజ్జగింపులు చేపట్టినా వెనక్కితగ్గలేదు. తుదకు నియోజకవర్గాల నుంచి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసం వరకు నిరసనలు తాకాయి. దీంతో వారందర్నీ వైసీపీ గుర్తించి, అవసరమైతే వైసీపీలోకి చేర్చుకునేలా అధిష్ఠానం ఆలోచిస్తోంది.

వైసీపీ ఏడు విడతలుగా ఇన్‌ఛార్జిల మార్పులు, చేర్పులు చేపట్టింది. అయినప్పటికీ పార్టీ బలోపేతంలో భాగంగా ఇతర పార్టీల్లో అసంతృప్తితో ఉన్న వారిని చేరదీసే పనిలో నాయకత్వం నిమగ్నమైంది. ఇప్పటికే స్థానికంగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు, నేతలంతా టీడీపీ, జనసేన నేతల ఇళ్లకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. ఈ ప్రక్రియను రాబోయే రెండు రోజుల్లో వేగవంతం చేయనున్నారు. వైసీపీ కీలక సమావేశానికి 175 నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలు, జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలతోపాటు మండల, పట్టణ కేంద్రాల నుంచి గృహ మిత్ర, గృహ సారథులు దాదాపు 2,500 మంది తరలిరానున్నారు. ఈ సమావేశం ద్వారా వారికి ఎన్నికలపై సీఎం జగన్ దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం ఇతర పార్టీల నుంచి వైసీపీలో చేరికలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టనున్నారు. అన్ని విధాలా పార్టీకి అనుకూలమని భావించిన వారికి వెంటనే చేరేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

హోదాపై మోదీ మోసం

- చంద్రబాబు, జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి
- విభజన హామీల సాధనలో విఫలం
- అనంత సభలో మల్లికార్జున ఖర్గే విమర్శ
- బీజేపీ, టీడీపీ, వైసీపీని ఓడిద్దాం: షర్మిల

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:
ఏపీకి పదేళ్లు ప్రత్యేక హోదా కల్పిస్తామని హామీ ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ మాట తప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఘాటుగా విమర్శించారు. ఇండియా కూటమిలో భాగంగా అనంతపురంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన న్యాయసాధన సభకు ఖర్గే, షర్మిల, సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, శ్రీనివాసరావు, మాజీమంత్రులు రఘువీరారెడ్డి, శైలజానాథ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఖర్గే మాట్లాడుతూ ఐదేళ్లు చంద్రబాబు, మరో ఐదేళ్లు జగన్‌మోహన్ రెడ్డి ఏపీకి ముఖ్యమంత్రులుగా పనిచేశారని, ఇద్దరూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. ప్రత్యేకహోదా, విభజన హామీలు సాధించడంలో ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. హోదా ఇవ్వకపోవడంతో పరిశ్రమలు రాలేదని, దీంతో నిరుద్యోగం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు, జగన్ బీజేపీతో కుమ్మక్కై

- మిగతా 2 లో

మోదీని, జగన్‌ను సాగనంపుదాం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-శింగనమల:
దేశంలో కుల, మతాల మధ్య చిచ్చు రేపుతూ ప్రజల్లో అశాంతిని నెలకొల్పుతున్న మోదీని, ఎన్నికల హామీలు మరచిన జగన్‌ను ఇంటికి సాగనంపుదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం అనంతపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన న్యాయ సాధన సభకు కాంగ్రెస్ పార్టీ జాతీయ

- మిగతా 2 లో

డబ్ల్యూటీవో నుంచి వైదొలగాలి

- కేంద్రాన్ని డిమాండ్ చేసిన రైతులు
- దేశవ్యాప్తంగా నిరసనోద్యమం
- జాతీయ రహదారుల వెంబడి ట్రాక్టర్లతో నిరసన

అమృత్‌సర్/హోషియాపూర్/హిస్సార్:
ప్రపంచ వాణిజ్య సంస్థ నుంచి భారత్ వైదొలగాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం జాతీయ రహదారులపై ట్రాక్టర్ల ఊరేగింపును ప్రారంభించారు. రైతు సంఘాల గొడుగు సంస్థ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఆదివారం ఫిబ్రవరి 26న 'క్విట్ డబ్ల్యూటీవో డే' ను పాటించనున్నట్లు ప్రకటించింది. ఇది కొనసాగుతున్న రైతుల ఆందోళనలో డిమాండ్లలో ఒకటిగా ఉంది. యమునా ఎక్స్‌ప్రెస్‌వే, లుహార్లీ టోల్ ప్లాజా, మహామాయ ఫ్లైఓవర్ మీదుగా రైతులు ట్రాక్టర్లపై నిరసన కవాతుకు ప్రణాళిక చేశారు.

సోమవారం మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందులో భాగంగా పంజాబ్, హర్యానాలోని అనేక చోట్ల హైవేలపై సోమవారం రైతులు తమ ట్రాక్టర్లను నిలిపారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కి చట్టపరమైన హామీ సహా వేర్వేరు డిమాండ్లపై కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు వేలాది మంది రైతులు తమ 'దిల్లీ చలో' ప్రదర్శన తర్వాత హర్యానా, పంజాబ్ సరిహద్దులోని ఖనౌరీ, శంభు పాయింట్ల వద్ద బస చేసిన నేపథ్యంలో ఇది

- మిగతా 2 లో

వయనాడ్ నుంచి అనీరాజా

కేరళలో 4 ఎంపీ స్థానాలకు సీపీఐ అభ్యర్థుల ఖరారు

తిరువనంతపురం:
రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కేరళలోని వయనాడ్ నియోజకవర్గం నుంచి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, భారత జాతీయ మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి అనీరాజా పోటీ చేయనున్నారు. కేరళలో అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్) లో రెండవ అతిపెద్ద భాగస్వామ్య పార్టీగా ఉన్న సీపీఐ.... రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు కీలక ఎంపీ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం తిరువనంతపురంలో మీడియా ప్రతినిధులకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న వయనాడ్ నియోజకవర్గం నుంచి సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సతీమణి అనీరాజా అభ్యర్థిత్వం ఖరారు కాగా తిరువనంతపురం లోక్‌సభ నియోజకవర్గం నుంచి పార్టీ కురువృద్ధుడు, మాజీ ఎంపీ పన్నియన్ రవిచంద్రన్ పోటీ చేయనున్నారు. ఇక మాజీ వ్యవసాయ మంత్రి వీఎస్ సునీల్ కుమార్ త్రిసూర్, పార్టీ యువజన విభాగం ఏఐవైఎఫ్ నాయకుడు సీఏ అరుణ్‌కుమార్ మావెలిక్కర స్థానాల నుంచి బరిలోకి దిగుతారని వినయ్ విశ్వం వెల్లడించారు.

కేరళలో ఎల్‌డీఎఫ్ విజయకేతనం

తిరువనంతపురం:
కేరళ స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికలలో ఎల్‌డీఎఫ్ విజయకేతనం ఎగరేసింది. ఎక్కువ స్థానాలు పొంది నైతిక విజయం పొందింది. వివిధ జిల్లాలలో 23 స్థానిక సంస్థల వార్డులలో ఈ నెల 23న ఎన్నికలు జరిగాయి. ఎల్‌డీఎఫ్ పది వార్డులను, యూడీఎఫ్ 10 వార్డులు గెలుచుకున్నాయి. వామపక్షాల మద్దతుతో మరొక అభ్యర్థి గెలిచారు. బీజేపీ మూడు సీట్లు గెలుచుకుంది. గతంలో నాలుగు వార్డుల్లో విజయం సాధించిన బీజేపీ మూడుకు తగ్గిపోయింది. ఎల్‌డీఎఫ్‌కి గతంలో మూడు వార్డులు మాత్రమే ఉండగా... ఇప్పుడు అవి పదికి పెరిగాయి. యూడీఎఫ్‌కి గతంలో పదమూడు స్థానాలుండగా ఇప్పుడవి పదికి తగ్గాయి. తిరువనంతపురం కార్పొరేషన్ వెల్లార్ వార్డులో బీజేపీని ఓడించి ఎల్‌డీఎఫ్ అభ్యర్థి విజయం సాధించారు. పంతురలో సీపీఐ అభ్యర్థి పి.బిజు ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థిపై 150 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఎల్‌డీఎఫ్ ఎర్నాకులం జిల్లా నెడుంబస్సేరి పంచాయతీలో కల్పకనగర్ వార్డును గెలుచుకున్నారు. త్రిసూర్ జిల్లా ముల్లస్సేరీ పంచాయతీలో పతియకులంగర వార్డు, కన్నూర్ జిల్లా ముజిప్పలనగాడ్ పంచాయతీలో మమ్మకున్ను వార్డు ఎల్‌డీఎఫ్ ఖాతాలో పడ్డాయి. గతంలో ఇది యూడీఎఫ్ చేతిలో ఉండేది. పలక్కాడ్ జిల్లా ఎరుతంపతి పంచాయతీలో ఒక వార్డును ఎల్‌డీఎఫ్ మద్దతు ఇచ్చిన స్వతంత్ర అభ్యర్థి మార్టిన్‌ఆంథోని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నన్ను గుర్తుపట్టారా? ఇన్నాళ్లూ పార్టీ కోసం పనిచేసి ఆస్తులమ్ముకున్నాను ఇప్పుడు సార్‌కి టిక్కెట్టొచ్చింది!

మృత్యు బడి

- గిరిజన ఆశ్రమాల దుస్థితి
- ఆగని విద్యార్థుల మరణాలు
- పీడిస్తున్న అనారోగ్య సమస్యలు
- ఫిబ్రవరిలోనే ఐదుగురి మృతి
- పట్టించుకోని అధికారులు

అనిత

బిడ్డిక శృతి


సీత

తాడంగి చంటి

విశాలాంధ్ర-కురుపాం:
పార్వతీపురం మన్యం జిల్లాలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మృత్యుఘోష ఆగటం లేదు. 2023-24 విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 17మంది అభం శుభం తెలియని గిరిజన బాలబాలికలు వివిధ రకాల రుగ్మతలకు గురై మృత్యువాత పడగా... ఒక్క ఫిబ్రవరిలోనే వివిధ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు చెందిన ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తోంది. గతంలో ఇలాంటి మరణాలను నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టడంతో కొంతవరకు విద్యార్థుల మరణాలు తగ్గుముఖం పట్టాయి. అయితే మూడేళ్లుగా ప్రభుత్వం విద్యార్థులు ఆరోగ్యాన్ని గాలికొదిలేసింది. ప్రత్యేక చర్యల మాట పక్కనబెడితే... గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేసే ఆరోగ్య సిబ్బందిని విధుల్లో నుంచి తప్పించింది. ఆశ్రమ పాఠశాలల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆహార మెనూ అమలుకు వసతిగృహాల సంరక్షణ అధికారులు తలలు పట్టుకుంటున్న పరిస్థితి నెలకొంది. తమ పిల్లలకు నాణ్యమైన ఆహారంతో పాటు, మంచిగా విద్యాబుద్ధులు నేర్పుతారని... తమలాగానే పిల్లలు సైతం అడవికి అంకితమై పోకుండా మంచి ఉద్యోగాలు చేసి ఆదుకుంటారని ఆశపడి బడికి పంపిస్తే మృతదేహాలను అప్పగిస్తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పదోతరగతి చదివే సీదిరి అశోక్ ఈనెల 17న కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. రక్తహీనతతో బాధపడుతున్న అశోక్‌కు గుండె పోటు వచ్చింది. అలాగే 20న సరాయివలస ఆశ్రమ పాఠశాల తొమ్మిది విద్యార్థిని పుంగారి అనిత రక్తహీనత, కిడ్నీ సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందగా... 21న కేధారిపురం ఆశ్రమ పాఠశాలలో

- మిగతా 2 లో

కుప్పం ఇక సస్యశ్యామలం

- హంద్రీ-నీవా జలాల విడుదలలో సీఎం జగన్
- పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని స్పష్టీకరణ

విశాలాంధ్ర-చిత్తూరు/కుప్పం:
పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత తమ ప్రభుత్వానిదేనని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గానికి హంద్రి-నీవా జలాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గంలోని

- మిగతా 2 లో

మా దేశంలో భారత సైనికులు లేరు

- అధ్యక్షుడు మయిజ్జు వ్యాఖ్యలు అసత్యం
- మాల్దీవుల మాజీ మంత్రి షాహిద్

మాలే: మాల్దీవుల్లో భారత సైనికులెవరూ లేరని ఆ దేశ విదేశాంగ శాఖ మాజీ మంత్రి అబ్దుల్లా షాహిద్ పేర్కొన్నారు. అక్కడ వందలమంది భారత సైనికులు ఉన్నారన్న అధ్యక్షుడు మహమ్మద్ మయిజ్జు చేసిన వ్యాఖ్యలను కొట్టిపారేశారు. తమ దేశ భూభాగంలో సాయుధులైన విదేశీ సైనికులెవరూ లేరని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో చేసిన ఆరోపణలకు ఆధారాలు చూపించలేకే మయిజ్జు ఇలాంటి అవాస్తవాలను ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. 100 రోజుల పాలనలో అనేక అసత్యాలు ప్రచారం చేశారని.. అందులో ఇదొకటని చెప్పారు. గతంలో అధికారంలో ఉన్న 'మాల్దీవియన్ డెమోక్రటిక్ పార్టీ (ఎండీపీ) వల్లే అనేక మంది భారత సైనికులు దేశంలోకి ప్రవేశించారని ఎన్నికల సమయంలో మయిజ్జు ప్రచారం చేశారు. ఇదే నినాదంతో ఆయన ప్రజలను రెచ్చగొట్టి ఓట్లు పొందే ప్రయత్నం చేశారని ఎండీపీ తెలిపింది. కానీ, భారత్‌తో అలాంటి ఒప్పందాలు కుదిరినట్లు అధికారంలోకి వచ్చాక నిరూపించలేకపోతున్నారని షాహిద్ అన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోతామనే భయంతోనే మయిజ్జు పదే పదే అసత్యాలు మాట్లాడుతున్నారన్నారు. తమ దేశంలోని మూడు వైమానిక స్థావరాల్లో ఒకదానిలో విధులు నిర్వహిస్తున్న బలగాలు మార్చి 10లోగా, మిగతా రెండు స్థావరాల్లోని దళాలు మే 10నాటికి వైదొలుగుతాయని ముయిజ్జు ఇటీవల వెల్లడించారు. భారత్‌కు చెందిన 80 మందితో కూడిన సైన్యం ప్రస్తుతం అక్కడ ఉంటోంది. భారత్ సహకారంతో ఏర్పాటు చేసిన రాడార్ స్టేషన్లు, నిఘా విమానాల నిర్వహణ బాధ్యతలు చూస్తోంది.

పలస్తీనా ప్రధాని శతాయే రాజీనామా

గాజా: పలస్తీనా ప్రధానమంత్రి మొహమ్మద్ శతాయే తన పదవికి రాజీనామా చేశారు. గాజాతో పాటు వెస్ట్ బ్యాంకులో హింస తీవ్రతరమవుతోన్న నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అధ్యక్షుడు మొహమూద్ అబ్బాస్‌కు రాజీనామా లేఖను అందించారు. గాజా పై ఇజ్రాయిల్ దురాక్రమణ... అనంతర పరిణామాలు, వెస్ట్‌బ్యాంక్, జెరుసలేంలలో హింసాత్మక ఘటనలు తీవ్రతరమైన క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. రాజీనామా లేఖను అధ్యక్షుడికి అందజేసినట్లు ఆయన ప్రకటించారు. హమాస్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ సాగిస్తోన్న పోరు ముగిసిన తర్వాత... ఇక్కడ రాజకీయ ఏర్పాట్ల గురించి పలస్తీనియన్లలో ఏకాభిప్రాయం ఏర్పడటానికి వీలుగా తాను రాజీనామా చేస్తున్నట్లు శతాయే చెప్పారు. అయితే, రాజీనామా ఆమోదంపై అధ్యక్షుడి నుంచి ఇంకా ప్రకటన వెలువడలేదు. పలస్తీనా ఇన్వెస్టిమెంట్ ఫండ్ ఛైర్మన్‌గా ఉన్న మొహమ్మద్ ముస్తఫాను నూతన ప్రధానిగా నియమించే అవకాశం ఉందని తెలుస్తోంది. యుద్ధం ముగిసిన తర్వాత గాజా ప్రాంతాన్ని పాలించే రాజకీయ వ్యవస్థ నిర్మాణంపై ఇప్పటికే ప్రయత్నాలు మొదలైనట్లు సమాచారం. ఇందుకోసం పలస్తీనా అథారిటీని పునర్‌వ్యవస్థీకరించాలని అమెరికా భావిస్తోందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే అంశంపై పలస్తీనా అధ్యక్షుడిపై అగ్రరాజ్యం నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నట్లు తెలుస్తోంది. పలస్తీనా అథారిటీలో సంస్కరణలు చేపట్టాలంటే అనేక అడ్డంకులు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రధాని రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

విశాలాంధ్ర ప్రపంచం

ఇజ్రాయిల్ నరమేధంపై

అమెరికా వాయుసేన ఉద్యోగి నిరసన

ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం

వాషింగ్టన్: గాజాపై ఇజ్రాయిల్ నరమేధాన్ని నిరసిస్తూ అమెరికా వాయుసేన ఉద్యోగి ఆత్మహత్యాయత్నం చేయడం కలకలం రేపింది. అమెరికా వాయుసేన ఉద్యోగి ఒకరు వాషింగ్టన్ డీసీలోని ఇజ్రాయిల్ దౌత్య కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటనకు ముందు అతడు తనను తాను ఆరోన్ బుష్ నెల్‌గా పరిచయం చేసుకున్నాడు. ఇజ్రాయిల్ సాగిస్తున్న నరమేధంలో తాను భాగస్వామిని కాబోనని ప్రకటించాడు. పలస్తీనా వాసుల బాధతో పోలిస్తే తాను అనుభవించబోయేది తక్కువే అని పేర్కొన్నాడు. ఆ తర్వాత రికార్డ్ పరికరాన్ని నేలపై ఉంచి తన వెంట తెచ్చుకొన్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకొని నిప్పంటించుకున్నాడు. 'ఫ్రీ పలస్తీనా' అనే నినాదాలు చేశాడు. అగ్నికీలల్లో కాలుతూ నేలపై పడిపోయాడు. సమాచారం అందుకొన్న సీక్రెట్ సర్వీస్ సిబ్బంది తగిన పరికరాలతో అక్కడకు చేరుకొని మంటలను ఆర్పేశారు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ ఘటనపై అమెరికా అధికారులు మాట్లాడుతూ అత్యంత తీవ్రమైన రాజకీయ నిరసన చర్యగా అభివర్ణించారు. డిసెంబర్‌లో కూడా అట్లాంటాలోని ఇజ్రాయిల్ దౌత్య కార్యాలయం ఎదుట ఒక వ్యక్తి ఇదే విధంగా చేసినట్లు గుర్తు చేశారు. అమెరికా వాయుసేన దీనిపై స్పందిస్తూ... ఆరోన్ తమ సిబ్బందే అని స్పష్టం చేసింది. తన నిరసనను అతడు ఓ సామాజిక మాధ్యమంలో లైవ్‌స్ట్రీమ్ చేశాడు. కానీ, తర్వాత ఆ దృశ్యాలను దాని నుంచి తొలగించారు. అక్టోబర్ 7వ తేదీన హమాస్ జరిపిన దాడిలో 1200 మంది ఇజ్రాయిల్ పౌరులు మరణించారు. ఆ తర్వాత గాజాపై మొదలైన ప్రతిదాడిలో ఇప్పటి వరకు దాదాపు 30,000 మంది పలస్తీనా వాసులు మృతిచెందగా... లక్షల మంది నిరాశ్రయులయ్యారు. ఇజ్రాయిల్ నరమేధాన్ని ఆపాలని ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయి.

కుప్పం ఇక సస్యశ్యామలం

(మొదటిపేజీ తరువాయి)

శాంతిపురం వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగిస్తూ గతంలో ఇచ్చిన హామీ మేరకు 672 కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రి-నీవా సుజల స్రవంతిలో భాగంగా కృష్ణా జలాలను కుప్పానికి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.569 కోట్లు వ్యయం చేశామని, దీని ద్వారా 6,300 ఎకరాలకు సాగు నీరుతో పాటు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని110 చెరువులకు నీటి సదుపాయం అందే అవకాశం దక్కిందన్నారు. ప్రస్తుత కుప్పం నియోజకవర్గ ఎమ్మెల్యే చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా పని చేసినప్పటికీ ఈ నియోజకవర్గానికి సాగు నీరు అందించాలని ఏనాడు ఆలోచించలేదని ఆరోపించారు. తాను 57 నెలల వ్యవధిలోనే ఈ నియోజకవర్గానికి హంద్రి-నీవా జలాలను అందించి మాట నిలబెట్టుకున్నానని చెప్పారు. గతంలో చంద్రబాబు నాయుడు హంద్రి-నీవా బ్రాంచ్ కెనాల్ పేరుతో భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపించారు. కుప్పం నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయాలన్న సంకల్పంతో మరో మూడు రిజర్వాయర్లకు పరిపాలన అనుమతులను మంజూరు చేసినట్లు సీఎం జగన్ చెప్పారు. ఈ నియోజకవర్గంలోని గుడిపల్లి, శాంతిపురం మండలాల్లో రూ.535 కోట్లతో రెండు రిజర్వాయర్లను నిర్మించున్నామని, వీటి ద్వారా 5 వేల ఎకరాలకు సాగునీటి సదుపాయం కలుగుతుందన్నారు. పాలారు ప్రాజెక్టు సమీపంలో రూ.215 కోట్లతో మరో రిజర్వాయర్‌ను నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే కుప్పంను మున్సిపాలిటీగా చేసి అభివృద్ధి కోసం రూ.66 కోట్లు నిధులు మంజూరు చేయడంతో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, పోలీసు సబ్ డివిజన్ సదుపాయం కల్పించిన ఘనత కూడా ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. 35 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు నాయుడు ఈ నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి అంటూ ఏమీ లేదన్నారు. చంద్రగిరి నుంచి అక్కడ ప్రజలు తరిమి కొడితే కుప్పానికి వలస వచ్చి ఇక్కడ ప్రజలను దగా చేస్తున్నట్లు సీఎం ఆరోపించారు. మరోమారు రాష్ట్ర ప్రజలను నమ్మించి మోసగించడానికి పొత్తులతో చంద్రబాబు నాయుడు ముందుకు వస్తున్నారని, రాష్ట్రానికి మంచి చేసి ఉంటే పొత్తులు ఎందుకని ప్రశ్నించారు. వంచన, మోసం, కుట్ర, వెన్నుపోటు చంద్రబాబు మార్కు రాజకీయమని ధ్వజమెత్తారు. కుప్పం నియోజకవర్గంలో ఎక్కువమంది బీసీలు ఉన్నారని, ఈ సీటును చంద్రబాబు బీసీలకు ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. తాను ఎక్కడ ఉన్నా పారదర్శకంగా నిష్పక్షపాతంగా సంక్షేమ ఫలాలను అందించానన్నారు. ప్రజలు వాస్తవాలను గుర్తించి అభివృద్ధి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు రానున్న ఎన్నికల్లో తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

డబ్ల్యూటీవో నుంచి వైదొలగాలి

(మొదటిపేజీ తరువాయి)

జరిగింది. పంజాబ్‌లోని హోషియార్‌పూర్‌లో, జలంధర్-జమ్మూ జాతీయ రహదారితో సహా అనేక ప్రాంతాల్లో రైతులు తమ ట్రాక్టర్లను నిలిపారు. దోబా కిసాన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగ్వీర్ సింగ్ చౌహాన్ నేతృత్వంలో రైతులు తమ ట్రాక్టర్లను తాండాలోని బిజిలీ ఘర్ చౌక్ వద్ద రోడ్డుపై నిలిపారు. ఈ సందర్భంగా జరిగిన ఒక సమావేశంలో చౌహాన్ ప్రసంగిస్తూ, ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) విధానాలను విమర్శించారు. వారిని 'రైతు వ్యతిరేకులు'గా అభివర్ణించారు. అలాగే, భారతీ కిసాన్ యూనియన్ (రాజెవాల్), బీకేయూ (ఖాడియన్), బీకేయూ (ఏక్తా ఉగ్రహన్) వంటి అనేక ఇతర వ్యవసాయ సంఘాల సభ్యులు కూడా ప్రదర్శనలు నిర్వహించారు. హోషియార్‌పూర్-ఫగ్వారా రోడ్, నస్రాలా-తారాగర్ రోడ్, దోసర్కా-ఫతేపూర్ రోడ్, బుల్లోవాల్-అలోవల్ రోడ్, ఖుంగా-హరియానా రోడ్‌ల వెంబడి తమ ట్రాక్టర్లను నిలిపి నిరసన తెలిపారు. పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ), రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, రైతులకు పింఛన్‌కు చట్టపరమైన హామీలు ఇవ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అమృత్‌సర్‌లో, అజ్నాలా, జండియాల గురు, రయ్యా, బియాస్‌లో తమ తమ వాహనాలను జాతీయ రహదారుల వెంబడి నిలిపారు. లూథియానాలో ఎస్‌కేఎంకు చెందిన రైతులు డబ్ల్యూటీవోకు వ్యతిరేకంగా లూథియానా-చండీగఢ్ రహదారిపై హైవే వెంట తమ ట్రాక్టర్లను నిలిపారు. హర్యానాలోని హిసార్‌లో రాష్ట్ర, జాతీయ రహదారుల వెంబడి 50 చోట్ల రైతులు తమ ట్రాక్టర్లను నిలిపి నిరసనలు చేపట్టారు. సురేవాలా చౌక్, మయ్యార్ టోల్, చౌదరివాస్, బాగ్లా మోర్, బాదోపట్టి, బాస్ టోల్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు నిర్వహించినట్లు అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు షంషేర్ సింగ్ నంబర్దార్ తెలిపారు. డబ్ల్యూటీవో విధానాల వల్ల ప్రభుత్వం అన్ని పంటలకు ఎంఎస్‌పీ ఇవ్వడం లేదని ఆయన పేర్కొన్నారు. 'భారత ప్రభుత్వం తన రైతులను

రక్షించడానికి, జాతీయ ఆహార భద్రతను నిర్ధారించడానికి దేశం హక్కులను దృఢంగా రక్షించాలి' అని ఎస్‌కేఎం ఒక ప్రకటనలో పేర్కొంది. 'డబ్ల్యూటీవో విధానం రైతులకు చాలా చెడ్డది. అది రైతులకు హక్కులు ఇవ్వదు' అని పంజాబ్ కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ ప్రధాన కార్యదర్శి సర్వన్ సింగ్ పంధర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం డబ్ల్యూటీవో నుంచి బయకు రావాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల డిమాండ్లను , రైతులకు ఇచ్చిన హామీని మరచిపోకూడదనే ట్రాక్టర్ల ప్రదర్శన చేపట్టినట్లు సోమవారం రైతు నాయకుడు తికైత్ తెలిపారు. 'మాకు ఇంకా ప్రభుత్వం నుంచి సందేశం రాలేదు. చర్చ కోసం ఇక్కడ నిరసన తెలుపుతున్నాం. అందువల్ల ఎప్పుడు సమావేశం జరిగినా మేము హాజరవుతాము' అని విలేకరుల సమావేశంలో ఒక రైతు నాయకుడు చెప్పినట్లు పీటీఐ పేర్కొంది.

దిల్లీ-యూపీ సరిహద్దుల్లో ట్రాఫిక్‌కు అంతరాయం

రైతుల ప్రతిపాదిత ట్రాక్టర్ మార్చ్ దృష్ట్యా సోమవారం దిల్లీ-ఉత్తరప్రదేశ్ సరిహద్దుల వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని అధికారులు తెలిపారు. దిల్లీలోని పోలీసులు సరిహద్దుల్లో బారికేడ్లు వేసి తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో దిల్లీ నుంచి నోయిడా వైపు చిల్లా బోర్డర్ వద్ద భారీగా ట్రాఫిక్ ఏర్పడింది. దిల్లీ-నోయిడా ఎక్స్‌ప్రెస్‌వే వద్ద కూడా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

రైతులపై పాశవిక దాడులా? నారాయణ

పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ దిల్లీ సరిహద్దులలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ సర్కారు క్రూరమైన అణచివేతను నిరసిస్తూ హైదరాబాద్ ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహం వద్ద సీపీఐ భారీ ప్రదర్శన నిర్వహించింది. పెద్ద సంఖ్యలో సీపీఐ శ్రేణులు ఎర్ర జెండాలు, ప్లకార్డులు చేతబూని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేస్తూ...ఆందోళన చేస్తున్న రైతు సంఘాలకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి డా. కె.నారాయణ మాట్లాడుతూ... రైతుల ఆందోళన అణిచివేతకు మోదీ ప్రభుత్వం పోలీసులతో పాశవికంగా దాడులు చేయిస్తూ హత్యాకాండకు పాల్పడుతోందని మండిపడ్డారు. పోలీస్ కాల్పుల్లో యువరైతు శుభకరన్ సింగ్ మృతి ఘటనపై కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న ప్రధాని మోదీ... రైతులను విశ్వాసంలోకి తీసుకోకుండా రైతు వ్యతిరేక చట్టాలను ప్రయోగించి బడా వ్యాపారులకు వ్యవసాయాన్ని అప్పగించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయాలని డిమాండ్ చేశా రు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే దేశ వ్యాప్తంగా ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, కలవేణి శంకర్, ఎన్. బాలమల్లేష్, ఈటీ నరసింహ, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటేశం, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, తెలంగాణ రాష్ట్ర గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. అంజయ్య నాయక్, సీపీఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నిర్లేకంటి శ్రీకాంత్, జి. చంద్రమోహన్ గౌడ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, మేడ్చల్ జిల్లా సిపిఐ నేతలు జె.లక్ష్మి, ఉమామహేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేరళలో ఎల్‌డీఎఫ్ విజయకేతనం

(మొదటిపేజీ తరువాయి)

గెలుపొందారు. ఈ వార్డు కూడా గతంలో యూడీఎఫ్ చేతిలోనే ఉండేది. ఎల్‌డీఎఫ్ గెలుచుకున్న వాటిలో సీపీఎమ్ 7, సీపీఐ 3 సీట్లు ఉన్నాయి. ఎల్‌డీఎఫ్ మంచి ఉత్సాహభరితంగా లోక్‌సభ ఎన్నికలకు సిద్ధం కావటానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దోహదం చేస్తుంది.

జర్నలిస్టుల సంక్షేమానికి

సమగ్ర విధానం ప్రకటించాలి

రాజకీయ పార్టీలకు ఏపీయూడబ్ల్యూజే వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి సమగ్ర విధానాన్ని రూపొందించాలని... అందు కోసం జర్నలిస్ట్ మేనిఫెస్టో ను అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) వివిధ రాజకీయ పక్షాలకు విజ్ఞప్తి చేసింది. ఆ మేరకు యూనియన్ రాష్ట్ర నాయకత్వ బృందం సోమవారం వివిధ రాజకీయ పక్షాల అగ్ర నాయకులను కలిసి ఏపీయూడబ్ల్యూజే రూపొందించిన 15 అంశాలతో కూడిన 'జర్నలిస్ట్ మేనిఫెస్టో'ను అందజేసింది. జర్నలిస్టుల సమస్యలను వివరించింది. అక్రెడిటేషన్ నిబంధనలను సరళతరం చేయాలని, గతంలో అమల్లో ఉన్న హెల్త్ కార్డుల పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని, ప్రమాద బీమా పథకం తిరిగి ప్రవేశ పెట్టాలని, ఇళ్లస్థలాల జీవోను మార్చి సీనియారిటీ ప్రాతిపదికన నామ మాత్రపు ధరకు స్థలాలు ఇవ్వాలని, గతంలో ఉన్న ప్రొఫెషనల్ కమిటీలను తిరిగి ఏర్పాటు చేయాలని, సంక్షేమ నిధిని పునరుద్ధరించాలని, ప్రెస్ అకాడమీకి నిధులు ఇచ్చి పనిచేయించాలని, రైల్వే ప్రయాణ రాయితీని కొనసాగించాలని, పాత్రికేయులకు పింఛను ఇవ్వాలని, ఉత్తమ జర్నలిస్టుల అవార్డులను తిరిగి ప్రారంభించాలని యూనియన్ కోరింది. రాజకీయ పార్టీలు తమ ఎన్నికల ప్రణాళికల్లో జర్నలిస్ట్ మేనిఫెస్టో ను కూడా ప్రకటించాలని కోరింది. యూనియన్ ప్రతినిధి బృందం తొలుత జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ అధ్య క్షులు నాదెండ్ల మనోహర్‌ను జనసేన రాష్ట్ర కార్యాలయంలో కలిసి వివరించగా... తమ కూటమి అధికారంలోకి వచ్చాక జర్నలిస్టుల సంక్షేమానికి, హక్కుల కోసం అండగా ఉంటా మని మనోహర్ హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ అధినేత చంద్రబాబుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి జర్నలిస్ట్ మేనిఫెస్టో ను అందజేయగా... జర్నలిస్టులకు గతంలో అమల్లో ఉండి , ప్రస్తుత ప్రభుత్వ హయాంలో రద్దయిన అన్ని పథకాలను తిరిగి అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తాము అధికారం లోకి వచ్చాక జర్నలిస్టులకు పూర్తి న్యాయం చేస్తామని చెప్పారు.అనంతరం యూనియన్ ప్రతినిధులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రజావ్యవహారాల సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని, ప్రజా విధానాల సలహాదారు నేమాని భాస్కర్‌ను, వైసీపీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి లేళ్ల అప్పిరెడ్డిని కలిసి 'జర్నలిస్ట్ మేనిఫెస్టో'ను అందచేసింది. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, ప్రధానకార్యదర్శి చందు జనార్దన్, ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే జయరాజు, ఆంధ్ర ప్రదేశ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి, యూనియన్ విజయవాడ అర్బన్ కమిటీ అధ్యక్షుడు చావా రవి, విజయవాడ ప్రెస్ క్లబ్ కార్యదర్శి డి.నాగరాజు పాల్గొన్నారు.

మోదీని, జగన్‌ను సాగనంపుదాం

(మొదటిపేజీ తరువాయి)

అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీశ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వమని విమర్శించారు. వ్యవసాయ వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి రైతులను అణగదొక్కే చర్యలకు పాల్పడుతోందన్నారు. రైతులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా పోరాటాలు చేస్తుంటే ఉద్యమాన్ని అణచివేసేందుకు కాల్పులు జరిపి రైతులను పొట్టన పెట్టుకున్న ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని ధ్వజమెత్తారు. అంబాని, అదానీలు చేసిన వేల కోట్ల అప్పులను మాఫీ చేస్తూ, పేద ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాడని విమర్శించారు. రైతులు పంటలు పండక, కొద్దో గొప్పో తీసుకున్న రుణాలను బ్యాంకుల్లో కట్టకపోతే బ్యాంకు సిబ్బంది రైతులను బెదిరిస్తూ ఏడిపిస్తూ కట్టించుకుటున్నారని తెలిపారు. మోదీ అధికారం కోసం వెంపర్లాడుతున్నాడని, ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి నిలువునా మోసం చేశాడన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 ఎన్నికల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా, రైల్వే జోన్ తెస్తానని, స్టీల్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తానంటూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చాడని, ఆ తరువాత హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ప్రతి ఏటా జాబ్ క్యాలెండరు విడుదల చేస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానన్న హామీ ఏమైందని రామకృష్ణ ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మెడలు వంచి రాష్ట్రానికి రావలసిన వాటాను తీసుకురాకుండా, ప్రశ్నిస్తే ఇబ్బందులు వస్తాయేమోనన్న భయంతో జగన్ ఉన్నాడని తెలిపారు. కేంద్రంలో బీజేపీని గద్దె దించేందుకు కలిసొచ్చే పార్టీలను కలుపుకొని 'ఇండియా' కూటమిని ఏర్పాటు చేశామని, ఇప్పుడు నీ భరతం పట్టేందుకు ప్రజలందరూ సన్నద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో మోదీకి, సీఎం జగన్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు పాల్యం నారాయణస్వామి, చిరుతల మల్లికార్జున, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హోదాపై మోదీ మోసం

(మొదటిపేజీ తరువాయి)

ప్రత్యేక హోదాకు చరమగీతం పాడారన్నారు. హోదాతోపాటు విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప స్టీల్‌ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక ప్యాకేజీ వంటి హామీలను మోదీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. స్వప్రయోజనాల కోసం జగన్, చంద్రబాబు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు తాకట్టు పెట్టారని అసహనం వెలిబుచ్చారు. బీజేపీకి టీడీపీ, వైసీపీ తొత్తులుగా మారాయన్నారు. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు ఆరాటపడుతుంటే...జగన్ లోపాయికారిగా అండగా నిలుస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే...రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు అంది ఉండేదని చెప్పారు.

షర్మిల మాట్లాడుతూ ఒక్క రాజధాని కట్టలేని సీఎం జగన్ మూడు రాజధానులు కడతానని నమ్మబలకడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మద్యపానం నిషేధం హామీ ఇచ్చిన జగనన్న...ఆ మాట మరిచి రాష్ట్రంలో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. కల్తీ మద్యం తాగి 25 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఓ వైపు అభివృద్ధి...మరో వైపు సంక్షేమం పరుగులు తీశాయని, జగనన్న పాలనలో అవి మచ్చుకు కూడా కనిపించడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా రాజశేఖర్‌రెడ్డి పాలన సాగిందని షర్మిల గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ పేదరిక నిర్మూలన ప్రధాన అజెండాగా పాలన సాగిస్తుందని, ప్రతి ఇంటికి ఐదు వేల రూపాయలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ అని, ఇందిరమ్మ అభయమని ప్రజలకు హామీ ఇచ్చారు. నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని, రాజన్న రాజ్యం రావాలంటే జగనన్న రాజ్యాన్ని కూల్చేయాలని, రాహుల్‌గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలంటే బీజేపీ, టీడీపీ, వైసీపీలను తరిమికొట్టాలని, కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సభలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, వేలసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మృత్యు బడి

(మొదటిపేజీ తరువాయి)

ఎనిమిదో తరగతి విద్యార్థిని బిడ్డిక సీత, పీటీజీ గురుకుల పాఠశాల విద్యార్థి బిడ్డిక శృతి కేజీహెచ్ లో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల 23న టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తాగండి చంటి (వంశీ) తెన్నుఖర్జ లో ఇంటిలో హఠాన్మరణం చెందాడు. ఈ విధంగా ఏటా గిరిజన సంక్షేమ విద్యార్థులు మృత్యు ఒడికి చేరుతున్నా... ప్రభుత్వం పిల్లల ఆరోగ్యంగా ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడంపై గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి.

వేధిస్తున్న రక్తహీనత

గిరిజన సంక్షేమ విద్యార్థులను చాలాకాలంగా రక్తహీనత సమస్య వేధిస్తోంది. అనేక సర్వేలు, పలుమార్లు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఈ విషయం స్పష్టమైంది. గతంలో ప్రాజెక్ట్ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువగా ఉండే వారిని ప్రత్యేకంగా ఉంచి రక్తం ఎక్కించడం, పౌష్టికాహారం, రక్తహీనత నివారణకు మందులుఅందించే ఏర్పాటు చేశారు. అధికారులు మారిపోగానే వాటిని అమలు చేసేవారే కరువై పోయారు. దీనికి మరో కారణం ఐటీడీఏకి నిధులు కొరత.

శాపంగా మారుతున్న పర్యవేక్షణ లోపం

పార్వతీపురం మన్యం జిల్లా ఐటీడీఏ పరిధిలోని సుమారు 50 వసతిగృహాల్లో 17వేలమంది విద్యార్థులు ఉంటూ చదువుతున్నారు. వారికి వసతి గృహాల్లో కనీస వసతులు కొరవడ్డాయి. మెనూ ప్రకారం భోజనం అందడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన మెనూ అమలు చేయలేమని వసతిగృహాల సంరక్షణ అధికారులు చేతులెత్తేస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదు. లాగే మెనూ బిల్లులు సకాలంలో విడుదల కాకపోవడం వల్ల మరింత ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో బిల్లులు విడుదల చేయలేని పర్యవేక్షణ అధికారులు(ఏటీడబ్ల్యుఓ,డీడీ) మెనూ అమలు విషయంలో కఠినంగా వ్యవహరించ లేక పోతున్నారు.అంతే కాకుండా ఆశ్రమ పాఠశాలలో అన్ని రకాల ఖర్చు వసతిగృహ సంరక్షణ అధికారులు పైనే ఉండటం మరో కారణంగా చెబుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి పటిష్ఠ చర్యలు అవసరం

మన్యం జిల్లా లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల వరుస మరణాలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఇకనైనా మరణాలు సంభవించకుండా విద్యార్థులకు మెరుగైన వైద్యం, పౌష్టికాహారం అందించే చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి. ఆశ్రమ పాఠశాలలో నిరంతరం వైద్య పర్యవేక్షణకు వైద్య సిబ్బంది ని నియమించాలి.

– తుమ్మి అప్పలరాజు దొర,
ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్

మానవ హక్కుల సంఘం స్పందించాలి

విద్యార్థుల వరుస మరణాల నివారణకు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం పై రాష్ట్ర మానవ హక్కుల సంఘం స్పందించాలి. విద్యార్థుల మరణాల నివారణకు తగు చర్యలు చేపట్టేలా ఆదేశించాలి. చదువుకుని ప్రయోజకులై తమను ఆదుకుంటారన్న ఆశతో ఆశ్రమ పాఠశాలలో చేర్పించిన తల్లి తండ్రులకు కళ్ల ముందే బిడ్డలు మరణిస్తుండటం గర్భశోకాన్ని మిగులుస్తోంది.

– చంద్రశేఖర్, ఏపి గిరిజనాభ్యుదయ సంఘం అధ్యక్షుడు

భారీ ప్రదర్శనగా కాంగ్రెస్ సభకు సీపీఐ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో అనంతపురంలో జరిగిన న్యాయ సాధన సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని స్థానిక కృష్ణకళా పరిషత్ నుంచి వేలాది మంది సీపీఐ కార్యకర్తలతో కలిసి సభా ప్రాంగణం జూనియర్ కాలేజీకి ప్రదర్శనగా వెళ్లారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, ఏపీ రైతుసంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, నాయకులు శ్రీరాములు, రామకృష్ణ, కేశవరెడ్డి, నారాయణస్వామి, రాజేశ్, కుల్లాయిస్వామి, సంతోశ్, నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగిపోయిన ఫ్లోటింగ్ బ్రిడ్జి

విశాఖలో ప్రారంభించిన 24 గంటల్లోనే...

పర్యాటకులు లేకపోవడంతో తప్పిన ముప్పు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖలో ఏర్పాటు చేసిన ఫ్లోటింగ్ బ్రిడ్జి ఒక్క రోజుకే తెగిపోయింది. సముద్రం అలలపై ఫ్లోటింగ్ బ్రిడ్జి ఏర్పాటు పర్యాటకుల ప్రాణాలతో చెలగాటమేనని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అట్టహాసంగా ఆదివారం ప్రారంభించిన ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ సోమవారం తెగిపోయింది. ఒక ముక్క విడిపోయి సముద్రంలో దూరంగా కొట్టుకుపోయింది. ఈ సమయంలో సందర్శకులు లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. విశాఖ ఆర్కే బీచ్‌లో ఆదివారం మంత్రి గుడివాడ అమర్‌నాథ్, రాజ్యసభ సభ్యుడు, వైసీపీ ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌ఛార్జ్ వైవీ సుబ్బారెడ్డి, జిల్లా కలెక్టర్ మల్లిఖార్జున తదితరులు ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అలలు ఎక్కువగా ఉండే ఆర్కే బీచ్ సముద్ర తీరంలో ఏర్పాటు చేయడం తగదని, ప్రమాదాలు జరుగుతాయని అనేక మంది అభ్యంతరాలు వ్యక్తం చేసినా వినకుండా కలెక్టర్ మల్లిఖార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పట్టుపట్టి మరీ ప్రైవేటు వ్యక్తులతో దీనిని ఏర్పాటు చేయించారని, ఓ ప్రైవేట్ నిర్మాణ సంస్థకు లబ్ధి చేకూర్చేందుకే నిర్మించారని అనేక మంది ఆరోపిస్తున్నారు. జోదుగుళ్ల పాలెం ఈ బ్రిడ్జిని తొలుత ఏర్పాటు చేయాలని భావించగా అటవీ శాఖ అభ్యంతరాలు తెలిపింది. దీంతో జీవీఎంసీ పరిధిలోకి వచ్చే ఆర్కే బీచ్‌లో హడావుడిగా ఏర్పాటు చేశారు. ఒకేసారి వంద మంది ఈ బ్రిడ్జి మీద ఉండే విధంగా అన్ని రకాల భద్రతా చర్యలతో ఏర్పాటు చేశామని కలెక్టర్ ప్రకటించిన 24 గంటలు గడవక ముందే బ్రిడ్జి మీద ఒక్కరు కూడా లేని సమయంలో బ్రిడ్జిలో ఒక ముక్క సముద్రంలో కొట్టుకుపోవడంతో భద్రతపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. సరైన అధ్యయనం లేకుండా, సంబంధిత శాఖల నిపుణుల అనుమతులు, నివేదికలు తీసుకోకుండా అధికారులు సుమారు కోటి 60 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన నిధులను బంగాళాఖాతంలో కలిపేసినట్టే అయిపోయిందంటున్నారు. మొండిగా వ్యవహరిస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జ్ తెగిపోవడమే నిదర్శమని సందర్శకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు పర్యాటకుల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటారా అని ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి బ్రిడ్జిలు నదీ పరివాహక ప్రాంతంలోనే పనిచేస్తాయని, సము ద్రం నీటిపై తీవ్రంగా వస్తున్న అలలపై, ఉప్పు నీటిపై పని చేయవని నిపుణులు అంటున్నారు. విశాఖలో ఈ ఫ్లోటింగ్ బ్రిడ్జి తెగిపోవడంపై సాగర తీరంలో తీవ్ర అలజడి నెలకొంది. అటుగా వచ్చిన పర్యాటకులంతా వామ్మో అంటూ భయాందోళన చెందారు.

నేటినుంచి ఏపీ టెట్

- భారీగా తగ్గిన దరఖాస్తులు
- సాంకేతిక సమస్యలే కారణం
- సరిహద్దు రాష్ట్రాల్లోనూ పరీక్షా కేంద్రాల ఏర్పాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్షలను (ఏపీ టెట్-2024) ఈనెల 27 నుంచి మార్చి తొమ్మిదో తేదీ వరకు నిర్వహిస్తారు. పేపర్-1 (ఏ, బీ), పేపర్-2 (ఏ, బీ) పరీక్షలు సబ్జెక్టుల వారీగా ప్రతి రోజూ రెండు సెషన్లుగా జరుగుతాయి. మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సెషన్ 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా 2,67,550 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. 2022లో 5,25,789 మంది దరఖాస్తు చేశారు. గతంతో పోలిస్తే దాదాపు 51 శాతం దరఖాస్తులు తగ్గాయి. దీనికి సర్వర్ల సమస్య, దరఖాస్తునకు తక్కువ వ్యవధి ఇవ్వడమే ప్రధాన కారణాలుగా అభ్యర్థులు చెబుతున్నారు. హాల్‌టిక్కెట్లను ఈనెల 23 నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. మార్చి 10న టెట్ కీ విడుదల చేస్తారు. అభ్యర్థుల నుంచి అభ్యంతరాలను 11వ తేదీన స్వీకరించి 13న ఫైనల్ కీను ప్రకటిస్తారు. 14న ఫలితాలను ప్రకటిస్తారు.

ఏపీ టెట్, డీఎస్సీ-2024 నోటిఫికేషన్లను ఏకకాలంలో ప్రభుత్వం విడుదల చేసింది. టెట్ పరీక్షలు అయిన వెంటనే డీఎస్సీ పరీక్షలు ఉంటాయి. అభ్యర్థుల ప్రిపరేషన్‌కు అతి తక్కువ సమయం ఉంది. మరింత సమయం ఉండేలా షెడ్యూలు విడుదల చేయాలని కొందరు అభ్యర్థులు హైకోర్టులో సవాల్ చేసినప్పటికీ ఫలితం లేదు. టెట్‌లో 20 శాతం మార్కుల వెయిటేజీ ఉంటుంది. ఆయా అభ్యర్థులు సాధించిన స్కోరును డీఎస్సీ మార్కులతో కలిపి ప్రతిభా జాబితాను రూపొందిస్తారు. విద్యాహక్కు చట్టం ఆధారంగా ప్రతి అభ్యర్థి టెట్‌లో అర్హత సాధించాలన్న నిబంధన ఉంది. అర్హత సాధిస్తేనే, డీఎస్సీ రాసే అవకాశముంటుంది. అర్హత సాధించని అభ్యర్థులు డీఎస్సీ రాసే అవకాశం కోల్పోతారు. గతంలో నిర్వహించిన టెట్‌లో లక్షలాది మంది అర్హత సాధించినప్పటికీ, మళ్లీ వెయిటేజీ కోసం వారంతా టెట్ రాస్తున్నారు. పరీక్షా కేంద్రాలను ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల్లోని చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్ తదితర నగరాల్లో ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు అసౌకర్యానికి గురవుతున్నారు.అభ్యర్థుల సౌకర్యార్థం మాక్ టెస్ట్‌లను csc.ap.gov.in వెబ్‌సైట్‌లో పేపర్ల వారీగా అందుబాటులో ఉంచారు.

నేతన్నల పింఛన్‌కు నిబంధనల శాపం

సహకార సంఘాలకు ఎన్నికలు జరిపించాలి: రామాంజనేయులు

విశాలాంధ్ర-కర్నూలు: రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని, సహకార సంఘాలకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుగిడే మాధవ స్వామి డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర సమితి పిలుపుమేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో)కి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, ప్రభుత్వ ఉత్తర్వుల్లో నూతన నిబంధనల వల్ల చేనేత కార్మికులు పెన్షన్ పొందాలంటే రెండు సంవత్సరాల పాటు వస్త్రాల తయారీకి అవసరమైన ముడి సరుకు కొనుగోలుకు సంబంధించిన జీఎస్టీ బిల్లులు చెల్లించి ఉండాలని, ఆన్‌లైన్ ద్వారా వేతనాలు పొందుతున్నట్లు బ్యాంకుల స్టేట్‌మెంట్లు తప్పనిసరి అని చెప్పటం శాపంగా మారిందన్నారు. సహకార సంఘాల్లోనూ, మాస్టర్ వీవర్స్ వద్ద పనిచేస్తున్న చేనేత కార్మికులు ఎప్పటికప్పుడు మజూరీలు తెచ్చుకుంటూ కుటుంబాలను పోషించుకుంటుండగా, ఆన్‌లైన్ ద్వారా వేతనాలు, జీఎస్టీ చెల్లింపు బిల్లుల ఆధారాలు చూపమనడం సరైంది కాదన్నారు. సాధారణ చేనేత కార్మికులకు ఇబ్బంది కలిగించే ఉత్తర్వులను తక్షణమే రద్దుచేసి యథావిధిగా అర్హత కలిగి 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడం, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోకుండా అధికారులే ఇష్టానుసారంగా నిర్ణయాలు తీసుకుంటూ అమలు చేస్తున్న విధానాల వల్ల చేనేత రంగం నష్టపోయిందన్నారు. ఉపాధి పూర్తిగా దెబ్బతిని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ చేనేతన కార్మికులు ఆకలిచావులకు గురౌతున్నా రన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించి చేనేత రంగాన్ని కాపాడాలని కోరారు.

'సామన' ఆశయ సాధనకు కృషి చేద్దాం

సంస్మరణ సభలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు వనజ

విశాలాంధ్ర-ఏలూరు: నగరంలో సీపీఐ ఉన్నతస్థితికి, చేనేత కార్మిక సంఘం నిర్మాణానికి విశేష కృషిచేసిన సామన శ్రీరాముల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ క్రియాశీలకంగా పనిచేయాలని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు దేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక తూర్పువీధి సెంటర్ ఏడో డివిజన్‌లో శ్రీరాములు సంస్మరణ సభ సోమవారం జరిగింది. చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బంధుమిత్రులు రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. ప్రస్తుత రాజకీయాల్లో ఏ రోజు ఎవరు ఏపార్టీలో ఉంటున్నారో అర్థం కావట్లేదని, శ్రీరాములు 40 సంవత్సరాలుగా సీపీఐలో ఉంటూ పార్టీలో వివిధ స్థాయిల్లో పనిచేసి ప్రజాసమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారని వారు కొనియాడారు. శ్రీరాములు మృతి పార్టీకి తీరని లోటని, ఆ లోటును భర్తీ చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని అన్నారు. నిబద్ధత, క్రమశిక్షణ పట్టుదల కలిగిన శ్రీరాములు వంటి కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీకి ఎంతో అవసరమని, పార్టీ శ్రేణులు ఆయన బాటలో నడవాలని వనజ, ప్రభాకర్, కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. బీకేఎంయు జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, కన్నయ్య మాట్లాడారు. భజంత్రీ శ్రీనివాసరావు , గేదెల నాగేశ్వరరావు, మిడతాని కృష్ణ, పోల వెంకట భాస్కరరావు, బుగ్గల ప్రభాకర్, యర్రా నాగేశ్వరరావు, అరిగెల యోహాన్ పాల్గొన్నారు.

ఎన్నికలకు పూర్తిస్థాయి సిద్ధం

నేడు వైసీపీ కీలక సమావేశం: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ శ్రేణులతో కీలక సమావేశానికి సిద్ధమైనట్లు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో మంగళవారం జరగబోయే సమావేశానికి మండల, బూత్ లెవెల్‌లో పనిచేస్తున్న పార్టీ శ్రేణులు, అసెంబ్లీ నియోజకవర్గాల పాత, కొత్త సమన్వయకర్తలు హాజరవుతారని చెప్పారు. ఏర్పాట్లను ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మంగళగిరి ఇన్‌ఛార్జి గంజి చిరంజీవిలతో కలిసి సోమవారం సజ్జల పరిశీలించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాబోయే ఎన్నికలముందు క్షేత్రస్థాయిలో జరగబోయే చివరి సమావేశం ఇదేనన్నారు. పార్టీ అధినేత, సీఎం జగన్ హాజరవుతారని చెప్పారు. వివిధ హోదాల్లో ఉన్న 2,700 మందికి ఆహ్వానాలను పంపామన్నారు. ఎన్నికల్లో ఎలా పనిచేయాలన్న దానిపై పార్టీ శ్రేణులకు సీఎం దిశానిర్దేశం చేస్తారన్నారు. క్షేత్రస్థాయిలో ఎంత అప్రమత్తంగా ఉండాలనే దానిపై సూచనలిస్తారని, ప్రజల్లోకి మరింత బలంగా పార్టీని ఎలా తీసుకెళ్లాలనే దానిపై వివరిస్తారని చెప్పారు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల్లో గట్టి టీమ్‌లను పూర్తి చేశామన్నారు. బూత్ కమిటీలనూ సిద్ధం చేస్తున్నామని వివరించారు. బూత్ కమిటీ మెంబర్ల ఎంపిక ప్రక్రియపై ఈ సమావేశం ద్వారా స్పష్టమవుతుందన్నారు. వైసీపీ పూర్తి స్థాయి ఎన్నికలకు సిద్ధమవు తుందన్నారు. ఎన్నికల్లో 175 స్థానాలకు 175 సాధనే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సిద్ధం సభలను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, మార్చి 3న బాపట్ల జిల్లా అద్దంకిలో సిద్ధం చివరి సభ జరగబోతుందని వివరించారు.

చంద్రబాబు బెయిల్ రద్దుపై విచారణ వాయిదా

కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులను సుప్రీంకోర్టు ఆదేశించింది. స్కిల్ కేసులో చంద్రబాబుకి హైకోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముకుల్ రోహత్గి వాదనలు వినిపిస్తూ... స్కిల్ కుంభకోణం కేసు దర్యాప్తు అధికారులు చంద్రబాబు కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని, తాము అధికారంలోకి వస్తే అధికారుల పనిపడతామని హెచ్చరిస్తున్నారని, ఇలా మాట్లాడుతూ బెయిల్ షరతులను ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. అందువల్ల వెంటనే చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని కోరారు. చంద్రబాబు తరపున హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదిస్తూ ప్రభుత్వ న్యాయవాది వాదనలను తీవ్రంగా ఖండించారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం చంద్రబాబు తరపు న్యాయవాదులకు రెండు వారాలు సమయం ఇచ్చింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

బొగ్గు కుంభకోణం కేసును సవాల్ చేసిన పొట్లూరి

బొగ్గు కుంభకోణం కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రముఖ పారిశ్రామిక వేత్త పొట్లూరి వరప్రసాద్ సోమవారం సుప్రీంకోర్టులో సవాలు చేశారు. బొగ్గు కుంభకోణం మనీలాండరింగ్ కేసులో పొట్లూరి వరప్రసాద్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇస్తూ ఈ ఏడాది జనవరి 30న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు తుది ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులను ఆయన నేరుగా సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే పొట్లూరి పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ప్రత్యేక కోర్టు ఉత్తర్వులను హైకోర్టులో సవాలు చేయకుండా నేరుగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంపై జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ధర్మాసనం అభ్యంతరం తెలిపింది. 2017లో సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకే బొగ్గు కుంభకోణంపై ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేశారని పొట్లూరి తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. 2017లో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేస్తూ ఇచ్చిన ఆదేశాలు ఇప్పుడు ఎలా వర్తిస్తాయని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిటిషన్‌లో తదుపరి వాదనలకు ముందు, హైకోర్టుకు వెళ్లకుండా నేరుగా సుప్రీంకోర్టుకు వచ్చే వ్యవహారంపై తాము ఒక నిర్ణయానికి రావాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో ఈడీ అభిప్రాయం తీసుకున్న తరువాతే నిర్ణయం తీసుకుంటామని చెపుతూ తదుపరి విచారణ రెండు వారాల తర్వాత చేపడతామని ధర్మాసనం పేర్కొంది.

విధ్వంసం, దోచుకోవడం వైసీపీ నైజం

వచ్చేది టీడీపీ-జనసేన ప్రభుత్వమే

టీడీపీ అధినేత చంద్రబాబు

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్ర విభజనతో జరిగిన నష్టం కంటే జగన్ పాలనలోనే రాష్ట్రానికి ఎక్కువ నష్టం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డువద్ద సోమవారం నిర్వహించిన 'రా కదలి రా' బహిరంగ సభలో చంద్రబాబు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి జగన్ అనాలోచిత నిర్ణయాలు, ఆర్థిక దోపిడీతో రాష్ట్రం సర్వ నాశమయ్యిందన్నారు. ఇసుక దోపిడీ, భూముల దోపిడీతో వైసీపీ నాయకులు ఆర్థికంగా ఎదిగారు తప్ప సామాన్యులకు ఒరిగిందేమీ లేదన్నారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టాక రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తే... 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను నిలుపుదల చేసి రాష్ట్ర అభివృద్ధిని 30 ఏళ్లు వెనక్కు నెట్టిందన్నారు. ఈ ఘనత జగన్ కే దక్కుతుందన్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదన్నారు. సంపద సృషించేవాడే నాయకుడని, అవేవీ జగన్‌మోహన్‌రెడ్డిలో లేవన్నారు. సృజల స్రవంతిని అటకెక్కించిన ఘనత వైసీపీదేనన్నారు. మూడు రాజధానులు ఏర్పాటు చేస్తానని చెప్పి విశాఖపట్నాన్ని గంజాయికి, రౌడీయిజానికి రాజధాని చేశారన్నారు. ఊరికొక ప్యాలెస్‌ను నిర్మించుకోవడంలో భాగంగా విశాఖపట్నం రుషి కొండను తవ్వి రూ.500కోట్లతో ప్యాలెస్ కట్టుకున్నారని... ప్రజలు తిరిగేందుకు సరైన ఆర్టీసీ బస్సులు లేవుగానీ ఆయన తిరిగేందుకు రూ.కోట్ల ప్రజా ధనంతో రెండు హెలీకాప్టర్‌లు, రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. ఖాళీ జాగా కనబడితే వైసీపీ నాయకులు కబ్జా చేస్తున్నారన్నారు. అబద్ధాలు చెప్పడంలో జగన్‌మోహన్‌రెడ్డికి పీహెచ్‌డీ ఇవ్వొచ్చని ఎద్దేవా చేశారు. జగన్ ప్రభుత్వాన్ని గద్దెదించితేనే రాష్ట్రం బాగుపడుతుందన్నారు. ప్రజా వ్యతరేక తుపాన్‌లో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని... వచ్చేది టీడీపీ, జనసే ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18ఏళ్లు నిండిన ప్రతీ ఆడపిల్లకు నెలకు రూ.1500లు, ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుకునేవారుంటే అందరికీ ఏడాదికి రూ.15వేలు చొప్పున చదువుకు సాయం అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. యువతకు సంవత్సరానికి నాలుగు లక్షల చొప్పున ఐదేళ్లలో 20లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తానని తెలిపారు. ఉద్యోగం వచ్చేంత వరకు నిరుద్యోగ భృతిని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా టీడీపీ అధ్యక్షులు కూన రవికుమార్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు గుండ లక్ష్మీదేవి, బగ్గు రమణమూర్తి, కళా వెంకటరావు, టీడీపీ నాయకులు గౌతు శిరీష, మామిడి గోవిందరావు, కలమట వెంకటరమణ టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా సురేంద్ర

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ షెడ్యూల్డ్ తెగల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్) సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియమితులుయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన నియామకం తక్షణమే అమలులోకి రానుంది.

తిరుపతిలో జగనన్న ఇళ్ల లబ్ధిదారుల అరెస్టు అన్యాయం: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుపతిలో జగనన్న ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం ఆందోళన చేస్తున్న పట్టదారులను, సీపీఎం నేతలను అరెస్టు చేయడం అన్యాయమని ఆ పార్టీ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, పట్టాదారులకు తుడా క్వార్టర్ల పరిధిలోనే ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇళ్ల లేని పేదలకు శెట్టిపల్లి పంచాయతీలో 2,736 మందికి తుడా క్వార్టర్లు పరిధిలో 41,109 ఎకరాల్లో ఇళ్ల స్థలాలు కేటాయించారని తెలిపారు. దాన్ని అర్థాంతరంగా, అకారణంగా మార్పు చేసి సుదూర ప్రాంతమైన ఏర్పేడు వద్ద చిందేపల్లిలో కేటాయిస్తున్నామని చెప్పటం అన్యాయమన్నారు. లబ్ధిదారులు అసలు తమకు స్థలం వస్తుందో రాదోనని ఆందోళన చెందుతూ మూడేళ్లుగా పోరాటం చేస్తున్నారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి ఇళ్లు కట్టిస్తానని ప్రగల్భాలు పలుకుతున్న వైసీపీ ప్రభుత్వం, ముందు కేటాయించిన స్థలాన్ని మార్పు చేయడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తుడా క్వార్టరు పరిధిలోనే లబ్ధిదారులకు స్థలాలు కేటాయించాలని కోరారు.

టీటీడీ కాంట్రాక్టు ఉద్యోగుల జీతాల పెంపు

- వచ్చే నెల 1 నుంచి స్విమ్స్ పద్మావతి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ అమలు
- గౌరవ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులకు ఉద్వాసన
- పాలకమండలి నిర్ణయాలు



విశాలాంధ్ర-తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లో కార్పొరేషన్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అన్ స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హెవీ స్కిల్డ్‌గా పని చేస్తున్న పనిచేస్తున్న 9 వేల మందికి వేతనాలు పెంచాలని పాలక మండలి నిర్ణయించింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రెండు నెలల వ్యవధిలో ఏకంగా 15 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలను పెంచడం ఇదే ప్రథమం. ఒక్కొక్కరికి వారి స్థాయిని బట్టి రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు జీతాలు పెంచాలని నిర్ణయించింది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో పాలక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అనేక నిర్ణయాలు తీసుకుంది. టీటీడీ అధ్వర్యంలో తిరుపతి పుట్టినరోజు పండుగను ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 24న నిర్వహించాలని, రూ.1.69 కోట్లతో నూతనంగా బంగారు తాపడంతో తలుపుల ఏర్పాటుకు, వడమాలపేట పాదిరేడు అరణ్యం వద్ద టీటీడీ ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్, ఇతర అభివృద్ధి చార్జీలను రూ.8.16 కోట్లు తుడాకు చెల్లించేందుకు ఆమోదం తెలిపింది. ఈ మొత్తాన్ని టీటీడీ ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు. లడ్డూప్రసాదాల తయారీని మరింత పెంచేందుకు అదనంగా మరో 15 మంది పోటు సూపర్‌వైజర్ల పోస్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడానికి, గత ఏడాది జమ్మూలో నిర్మించిన శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి హెచ్‌ఆర్‌ఏను పెంచేందుకు, తిరుపతి హరే రామ హరే కృష్ణ రోడ్డులోని ఇన్‌కమ్‌టాక్స్ గెస్ట్ హౌస్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో రూ.7.51 కోట్లతో నూతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి, స్విమ్స్ (శ్రీవేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ) కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి 1 నుంచి జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్స్ వంటి ప్రత్యేక విభాగాలతో పాటు జ్వరాలు, వాంతులు, విరేచనాలు లాంటి సాధారణ వ్యాధులకు కూడా ఇకపై ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదురహిత వైద్య సేవలు అందించేందుకు నిర్ణయించింది. తిరుమలలోని ఎస్వీ ఎంప్లాయిస్ క్యాంటీన్‌లో వంటశాల, భోజనశాల విస్తరణకు రూ.8.15 కోట్లు, అవసరమైన వంట సామగ్రి కొనుగోలుకు రూ.3 కోట్లు మంజూరుకు ఆమోదం తెలిపింది. టీటీడీ అధికారులు, పాలకమండలి సభ్యులు, జియ్యంగార్లు, అర్చకులతో పాటు అహోబిల మఠంపై నిందారోపణలు చేసిన గౌరవ ప్రధానార్చకులు రమణదీక్షితులను ఉద్యోగం నుంచి తొలగించాలని పాలక మండలి తీర్మానించింది. ఈ సమావేశంలో టీటీడీ ఈవో ఎ.వి.ధర్మారెడ్డి, అనేక మంది బోర్డు సభ్యులు జేఈవో వీరబ్రహ్మం పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్ ఢీకొని నలుగురి దుర్మరణం

విశాలాంధ్ర-ప్రత్తిపాడు: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వివరాలివి... ఒడిశా నుంచి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం నక్కబొక్కలపాడుకు రెండు లారీలు లోడ్‌తో వెళ్తుండగా, ప్రత్తిపాడు సమీపంలోని పాదాలమ్మతల్లి గుడి వద్ద ఒక లారీ టైర్ పంక్చరైంది. లారీలను డ్రైవర్లు రోడ్డు పక్కనే నిలిపి టైర్‌ను మారుస్తుండగా... అతి వేగంగా విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళున్న ఏపీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వారిపై నుంచి దూసుకుపోవడంతో ముగ్గురూ ఘటన స్థలంలోనే మృతి చెందారు. మృతులు దాసరి కిషోర్, దాసరి ప్రసాద్, నాగయ్యగా గుర్తించారు. అంతటితో ఆగక పాదాలమ్మ తల్లి గుడి వాచ్‌మాన్‌గా పనిచేస్తున్న విడిది లోవరాజును కూడా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రెక్కాడితే గాని డొక్కాడని ఆ నలుగురి ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. బస్సు డ్రైవర్ పరారైనట్లు సీఐ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఘటన స్థలాన్ని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి, ప్రత్తిపాడు సీఐ శేఖర్ బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, ఎస్ఐలు పవన్ కుమార్, సతీశ్, కిషోర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుల బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

సంపాదకీయం

గిరిజనంపై అకృత్యాలు

పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ ఆగడాలు పెచ్చుమీరిపోతున్నాయని సందేశ్‌ఖలీ ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకరోజు కాదు రెండ్రోజులు కాదు... కొన్ని నెలలుగా సందేశ్‌ఖలీ గిరిజనులపై అకృత్యాలు జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణం. టీఎంసీ నేతల దౌర్జన్యాలు ఒక్కొక్కటికీ వెలుగులోకి రావడం ఆందోళనకరం. పోలీసుల పాత్రనూ త్రోసిపుచ్చలేం. ఈ అకృత్యాలను కనిపెట్టేందుకు వెళ్లిన నిజనిర్ధారణ బృందాన్ని పోలీసులు మధ్యలో ఆపేసి, అరెస్టు చేయడం ఈ అనుమానాలకు తావిస్తోంది. తృణమూల్ నాయకుడు షేక్ షాజహాన్, అతని సహచరులు సందేశ్‌ఖలీలో భూకబ్జాలు, గిరిజన మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నా పట్టని పోలీసులు ఈ ఘటనలపై ఎవరు గళమెత్తినా నోరునొక్కే ప్రయత్నం చేస్తున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా ఓటు వేసినందుకు పేద గిరిజన కుటుంబాల నుంచి 'ఉపాధి' వేతనాలను బలవంతంగా లాక్కున్నారని ఈ మధ్య జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) తెలిపింది. షాజహాన్, అతని సహచరులను పశ్చిమ బెంగాల్ పోలీసులు రక్షించారని ఫిర్యాదుదారులు చెపుతున్నట్లు ఈ కమిషన్ వైస్ చైర్‌పర్సన్ అనంత నాయక్ నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బృందం తమ సంచలన నివేదికలో వెల్లడించింది. తాజాగా ఈ అంశంపై పశ్చిమబెంగాల్, కేంద్ర ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది. షాజహాన్ దుండగుల ముఠా గిరిజన మహిళలపై లైంగిక వేధింపులకు ఒడిగట్టారని, భూకబ్జాలకు పాల్పడ్డారని ప్రాథమికంగా 50కి పైగా ఫిర్యాదులు అందాయి. టీఎంసీ నేతల బెదిరింపులు, పోలీసుల హెచ్చరికల నేపథ్యంలో ఇంకా చాలామంది గిరిజనులు ఫిర్యాదులు చేయడానికి ముందుకు రావడం లేదు.

సందేశ్‌ఖలీ ప్రాంతమనేది కోల్‌కతాకు 100 కిలోమీటర్ల దూరంలో సుందర్‌బన్స్ సరిహద్దుల్లో ఉన్న పశ్చిమ బెంగాల్‌లోని ఉత్తర 24 పరగణాల జిల్లాలోని నదీతీరంలో ఉంది. నిరుపేద గిరిజనులు 'ఉపాధి హామీ పథకం' కింద అందుకున్న పైసలనూ తనకే ఇవ్వాలని షాజహాన్ ఆదేశిస్తాడని తేలింది. ఒకవేళ వారు ఆ డబ్బును అప్పటికే ఖర్చు చేసిఉంటే ఇంకెక్కడైనా డబ్బు అప్పుగా తీసుకుని ఇచ్చి తీరాల్సిందేనని బెదిరిస్తాడని గిరిజనులు వాపోయారు. ఈ తరహా అరాచకాలు పాచిపట్టిన బూర్జువా లక్షణాలు కావచ్చు. అయితే సందేశ్‌ఖలీలో హిందువులు మెజారిటీగా ఉన్నారని, అందుకే ముస్లిమ్ అయిన షాజహాన్ అఘాయిత్యాలకు అంతులేకుండా పోతున్నదని మోదీ ప్రభుత్వ మెచ్చుకోలుకోసం ఈ సమస్యను మతపరం చేయడానికి జరుగుతున్న ప్రయత్నాన్ని మాత్రం ఖండించాల్సిందే. అదే సమయంలో సందేశ్‌ఖలీలో కొనసాగుతున్న ఉద్రిక్తతను చల్లార్చడానికి అవసరమైతే తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాల్సి ఉంటుంది. షాజహాన్, అతని సహచరులు స్థానిక మహిళలను అర్ధరాత్రి సమావేశాలకు రావాలని బలవంతపెడుతున్నారనేది వాస్తవం. తన డిమాండ్లను పాటించని వారి కుటుంబ సభ్యులను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ముఖ్యంగా లైంగిక వేధింపులకు గురిచేయడం జుగుప్సాకరం. విచిత్రమేమిటంటే, బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే...వారు ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా షాజహాన్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించుకోండని ఉచిత సలహాలిస్తున్నారు. ఈ కేసుల్లో నిందితులందరికీ పోలీసుల సంపూర్ణ మద్దతు ఉంది. టీఎంసీ నేతల కబ్జాకు గురైన తమ భూమిని తిరిగి అప్పగించాలని నిరసన వ్యక్తం చేస్తే పొలాల్లో ఉప్పు నీటిని వదులుతామని వారు బెదిరిస్తారు. 10 కిలోమీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో వెయ్యి మందికి పైగా గిరిజన, గిరిజనేతరుల భూములను షాజహాన్ ముఠా లాక్కున్నట్లు ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 20న జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ పశ్చిమ బెంగాల్ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పోలీసు ప్రధానాధికారికి నోటీసులు జారీ చేసి, మూడు రోజుల్లో ఈ అంశంపై తీసుకున్న చర్యల నివేదికలు సమర్పించాలని కోరింది. కానీ ఆరు రోజులైనా అతీగతీలేదు. వారి నుంచి ఎలాంటి నివేదికలు అందకపోగా, తాత్సారానికి కారణం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలేనని తెలుస్తోంది. సందేశ్‌ఖలీ బ్లాక్‌లోని మజేర్‌పరా, హల్దర్‌పరా ప్రాంతాల్లో భూకబ్జాకు గురైన ప్రాంతం పూర్తిగా షాజహాన్, అతని సోదరుడు సిరాజుద్దీన్ ఆధీనంలో ఉంది. ఈ అకృత్యాలపై గత కొన్ని రోజులుగా ప్రజల నుంచి నిరసనలు వెల్లువెత్తాయి. ఈ ఆందోళనలు కోల్‌కతా వరకూ వ్యాపించాయి. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పెద్దగా పట్టించుకోవడం లేదని ప్రతిపక్షాలు చెపుతున్నాయి. ప్రస్తుతం పరారీలో ఉన్న షాజహాన్, సిరాజుద్దీన్‌లను అరెస్టు చేయాలన్నది కూడా వారి ప్రధాన డిమాండ్. కాకపోతే వారు కోల్‌కతాలో బహిరంగంగానే తిరుగుతూ బార్లు, రెస్టారెంట్లలో దర్శనమిస్తూ ప్రజల కళ్లకు గంతలు కడుతున్నారు. మమతా బెనర్జీ సానుభూతి తమకు అక్కర్లేదని, నిందితులకు మరణశిక్ష విధించాలని బాధితులు కోరుతున్నారు. సందేశ్‌ఖలీ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో షాజహాన్, అతని అనుచరులు అమాయక గిరిజనులను పోలీసుల ముందే దుర్మార్గంగా కొట్టిన ఘటనలను విస్మరించలేం. సందేశ్‌ఖలీలో పరిస్థితిపై పశ్చిమ బెంగాల్ డీజీపీ రాజీవ్ కుమార్ స్పందిస్తూ తప్పు జరిగిన విషయాన్ని అంగీకరించారు. ఫిర్యాదులివ్వాలే తప్ప చట్టాన్ని మీ చేతుల్లోకి తీసుకోవద్దని సలహాఇవ్వడం అర్థరహితం. స్పష్టంగా అగుపిస్తున్న అక్రమాలను అడ్డుకోవడంలో పోలీసుల దుర్నీతిని ఎందుకు విస్మరించారనే ప్రశ్నకు డీజీపీ వద్ద సమాధానం లేదు.

గ్రామస్తుల ఫిర్యాదుల కోసం బెర్మోజూర్‌లో పోలీసులు శిబిరాన్ని ప్రారంభించగా, ఒక్కరోజే షాజహాన్, సిరాజుద్దీన్‌లపై 50కి పైగా భూకబ్జా ఫిర్యాదులు అందాయి. అయినప్పటికీ, పోలీసులు కదల్లేదు. సరికదా, అతన్ని తృణమూల్ కాంగ్రెస్ ఏనాడో బహిష్కరించిందని సందేశ్‌ఖలీ ఎమ్మెల్యే సుకుమార్ మెహతో ప్రకటించడం మరో విడ్డూరం. గత కొన్ని రోజులుగా నిందితులకు టీఎంసీ మంత్రులే ఆశ్రయం ఇస్తున్నారని తెలుసుకున్న నిజనిర్ధారణ బృందాన్నీ పోలీసులు ముందుకు కదలనివ్వలేదు. ఆందోళనకారులపై సందేశ్‌ఖలీలో ఆంక్షలు విధించారు. సీఆర్‌పీసీ 144 సెక్షన్ విధించారు. ఇద్దరు మంత్రులు మాత్రం బాహాటంగానే తిరుగుతూ ఇక శాంతించండంటూ గిరిజనులను బెదిరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచం ముందు ఎలాంటి చిత్రాన్ని చూపించాలనుకుంటుందో అర్థం కావడం లేదని, రాష్ట్రంలో పాలనా యంత్రాంగం కుప్పకూలిందని పాట్నా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి, మాజీ ఐపీఎస్ అధికారి రాజ్‌పాల్‌సింగ్, జాతీయ మహిళా కమిషన్ మాజీ సభ్యులు చారువాలీ ఖన్నా, న్యాయవాది భావాబజాజ్‌లతో కూడిన నిజనిర్ధారణ కమిటీ ఆరోపించింది. టీఎంసీకి ఓటు వేయనందుకే ఇలా గిరిజనులను హింసిస్తుండటం అసహేతుకం, దురదృష్టకరం. సందేశ్‌ఖలీ ఉదంతాన్ని తమకు అనుకూలంగా మలచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగా ప్రయత్నించకముందే మమతా బెనర్జీ స్పందించి, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే దీని ఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుంది.

అచ్ఛేదిన్

చింతపట్ల సుదర్శన్

మాంసం కొట్టు ముందు వెనకకాళ్ళ మీద కూచునుంది డాగీ. షాపువాడూ ఏక్షణమైనా ఓ ఎముక విసిరేయక పోడు అని వెయిట్ చేస్తున్నది. చుట్టుపక్కల మరో వీధి కుక్కేదీ కనపడక పోవటంతో ఆనందంగా కూడా ఉంది. నిరీక్షణ ఫలించింది. షాపులో నుంచి ఒక ఎముక ఎగిరొచ్చి దాగీ ముందు పడ్నే పడింది. 'మన కెవ్వరు సాటి– లేరెవ్వరు పోటీ' అనుకుంటూ అడుగు దూరంలో పడ్డ దాని కోసం అడుగు కదిలిం చింది వీలైనంత 'స్లో 'గా. అనుకోనిది జరగడమేకదా లోక రివాజు. డాగీ పక్కనుంచి వేగంగా ముందుకు కదిలి ఒకే ఒక్క జంపు చేసి ఎముకను అందుకుని అదే వేగంతో వెనక్కు పరుగెత్తింది మరో 'స్ట్రీట్ డాగ్'. 'షాక్ ' నుంచి తేరుకుని దాని వెనకే పరుగెత్తింది డాగీ. కొంచెం దూరం పరుగెత్తిన 'స్ట్రీట్ డాగ్' ఆగింది. వెనక్కి తిరిగింది. ఎముకను నోట్లో నుంచి కింద పడేసి, దాన్ని ముందు కాలితో తొక్కిపట్టి నోటిలో పళ్ళన్నీ బయటపెట్టి గుర్రుమంది. చేసేదంతా చేసి గుర్రు మంటున్నావ్. ఇదేం న్యాయం, ఇదేం ధర్మం. షాప్ ముందు కూచుని ' వెయిట్' చేసింది నేను. ఎక్కడ్నించో వచ్చి నా నోటికాడి కూడు లాక్కుంది నువ్వు. పార్టీలో పాతుకుపోయి సేవచేసిన

రంగస్థలం

వాడ్ని కాదని మరో పార్టీలో నుంచి దూకిన వాడికి సీటుకు టిక్కెట్టు దొరికినట్టు, నీకా ఎముక దొరికింది. న్యాయంగా అది నాది అంది డాగీ. పాలిటిక్స్ నాకర్థం కావు. ఆ విషయాలు నీకూ, నీ డాంకీ ఫ్రెండ్‌కే అర్థమవుతాయి. నేను మామూలు వీధి కుక్కను. మనుషుల భాషరాదు, నీకున్న తెలివీ లేదు అంది అవతలి కుక్క మాటలొద్దు. నువ్వు చేసింది చీటింగ్ అని ఒప్పేసుకో అంది డాగీ. అసలు విషయం తెలీదునీకు. నేను నీకన్నా ముందే వచ్చి, కరెంట్ పోల్ వెనక్కూచున్నాను. చాలాసేపట్నించి. షాపువాడు నన్ను చూశాడు. ఉండు కాస్సేపు ఆగు అన్నట్టుంది ఆచూపు. ఇంతట్లో నువ్వు వచ్చావు. నేను కూచున్నది చూడకుండా నాలుగడుగులు ముందుకెళ్ళావు. నిజానికి షాపువాడు ముందు చూసింది నన్ను. ఈ ఎముక నావైపే విసిరాడు. అయితే తను 'ఫాస్ట్ బౌలింగ్' తెలీక 'స్పిన్' వేశాడు. అది నాముందుకు రాక నీముందు వచ్చిపడింది అంతే అంది స్ట్రీట్ డాగ్. అవునా! నువ్వు చెప్పేది నిజమేనా అంది డాగీ.. నీకూ డాంకీకి ఉన్న దోస్తీ మీద ఒట్టు అంది అవతలిది. నువ్వన్నది నిజమైతే అయాం సారీ అంది డాగీ. ఆ తర్వాత మళ్లీ షాపు ముందుకు వెళ్ళి కూచుంది తన అదృష్టాన్ని పరీక్షించుకోటానికి.

అరుగు ఎక్కిన డాంకీకి గోడ వారన రెస్టు తీసుకుంటున్న డాగీ కనిపించింది. ఏంటి 'బ్రో' తొందరగా వచ్చేశావు అంటూ తన జాగాలోకి వెళ్ళి కూచుంది డాంకీ. ఎవ్రీథింగ్ ఓకే. కాకపోతే చిన్న 'మిస్ అండర్ స్టాండింగ్' అంతే. ఏమిటో అది అంది డాంకీ చెవులు ఎగరేస్తూ. ఏం లేదు. సింపుల్. నేను షాపు ముందు కూచున్నా. నావెనకే స్తంభం వెనుక మరో ఫ్రెండ్ ఉన్నాడన్నది చూసుకోలేదు. షాపువాడు నాకు వేశా డనుకున్న ఎముక నాకు కాదు, దానికి. ఎందుకంటే అది నాకంటే ముందు అక్కడ కూచుంది. షాపువాడు దాన్ని ముందు చూశాడు కనుక ఎముక దానికి విసిరేశాడు. నాదనుకుని జగడానికి వెళ్ళా. అర్థమయ్యేక వెనక్కి మళ్ళా అంది డాగీ. నువ్వు చెప్పేది వింటే మహాభారతం గుర్తుకు వస్తున్నది. యుద్ధంలో సాయం అడగడానికి అర్జునుడూ, దుర్యోధనుడూ వెళ్లార్ట. కృష్ణుడు అర్జునుడ్ని ముందు చూశాడు కనుక అతనికే సాయం చేస్తానన్నాట్ట. అబ్బో ఈ మాత్రం దానికి మహాభారతం దాకా వెళ్ళి పోయేవా? ఇంత నాలెడ్జ్ ఉందా నీకు. ఇది నా నాలెడ్జి కాదు మన సంగతులు రాస్తున్న 'సుదర్శన్' అనే వాడి బుర్రలోంచి నాబుర్రలోకి 'ట్రాన్స్‌ఫర్' చేసిన విషయమే ఇది అంది డాంకీ. ఊరికే ఏవిషయమూ నీ బుర్రలోకీ నా బుర్రలోకీ జొప్పించడు కదా అంది డాగీ. ఎలెక్షన్లు వస్తున్నాయి కదా! రాజకీయ అవసరాలకు 'దోస్త్ మేరా దోస్త్' అంటూ 'పొత్తు' కోసం పొర్లు దండాలు పెడుతూ మనోళ్ళు అయినను 'పోయి రావలె హస్తినకు' అని పరుగులు పెడ్తున్నారు. ఇందు నిమిత్తం ఓ బాస్ ఇదివరకే ఓ విమానం ఓ హెలికాప్టర్ ఉన్నా మరో రెండు 'డబుల్ ఇంజన్ చాపర్స్' సిద్ధం చేసుకున్నాడు ఎప్పుడంటే అప్పుడు సిద్ధంగా వెళ్ళిపోడానికి పొత్తు కోసమూ, అవసరార్థం స్నేహం కోసమూ రాష్ట్రంలో అన్ని పార్టీల వాళ్ళూ అర్రులు చాస్తున్నారు అంది డాంకీ. అవునవును కుటుంబాలకు 'నియంత్రణ' అవసరం కానీ పార్టీలకు కాదు. ఎంత మంది ఎక్కువైతే అంత మంచి పొత్తు అంటున్నారు, పైవాళ్ళు అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. ఎవరి అవసరాలు వాళ్ళవి. కేసుల బాధ తప్పడానికి ఒకరు పగటి పూట 'పొత్తు' కు పోతే, నవశకానికి నాంది అంటూ జమిలిగా రాత్రి పూట మరో ఇద్దరు 'పొత్తు' దర్శనాలకు వెళ్ళా రట గదా అంది డాంకీ. ఈ పొత్తు, సర్దుబాట్లు, బేరసారాలలో టికెట్టు దొరకని వాళ్ళు. అరికాళ్ళ కింద మంటలురేగి పొయ్యిలోంచి పెనం మీదకి, పెనం మీది నుంచి పొయ్యిలోకి దూకడాన్ని 'సర్కసు' చూసినట్టు చూడొచ్చునన్నమాట అంది డాగీ.

ఎన్నికల దాకా ఎన్నిరకాల ఎంటర్టైన్మెంట్లో జనానికి. ఇంతకీ 'మెగా డిఎస్సీ' ఏమైనది అంది డాంకీ. ఏమౌతుంది 'దగా డీఎస్సీ' అంటున్నారు అంటూ నిట్టూర్చాడు అబ్బాయి. అచ్ఛేదిన్... అచ్ఛేదిన్... అంటారు గదా, అవంటూ ఉంటయా? వస్తయా? అసలు అచ్ఛేదిన్' ఎవరికొస్తయి అంది డాంకీ. ఇంకెవరికి? అప్పుడూ, ఇప్పుడూ, ఎప్పుడయినా ఏలిన వారికే తప్ప ఎన్నుకునే వారికి రావు అంది డాగీ.

బీజేపీ హిందూ వ్యతిరేక పార్టీ

బండ్ల శ్రీనివాస్, నెల్లూరు నరసింహారావు, నలమాటి లక్ష్మణరావు

ఇది ఎన్నికల సమయం. బీజేపీ కేంద్రంలో వరుసగా మూడవసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని ప్రయత్నిస్తోంది. స్వతంత్ర భారతదేశంలో మునుపెన్నడూ చూడని విధంగా ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు అక్రమ మార్గాలలో సహాయం చేసింది, దేశంలో సంపద, ఆదాయ అసమానతలను పెంచింది. సామాన్య ప్రజల జీవనో పాధిని నాశనం చేసింది. ముస్లింల భయం, రామరాజ్యంపై ఆశలు, నకిలీ విశ్వ గురుపై గుడ్డి విశ్వాసం కలిగించటం వంటి చౌకవ్యూహాలద్వారా ఉత్తర భారతీయ హిందువుల మనస్సులను బీజేపీ మరింతగా స్వాధీనం చేసుకుంది. ఓట్లను రాబట్టేందుకు మతపరమైన మనోభావాలను రెచ్చగొట్టి 2024 ఎన్నికలలో గెలవాలని ప్రయత్నిస్తోంది.

కాబట్టి, ఈ మతతత్వ ఫాసిస్టు బీజేపీ తిరిగి కేంద్రంలో అధికారాన్ని చేజిక్కించుకోకుండా ఆపిమన దేశాన్ని, ప్రజలనురక్షించుకునే సమయం ఆసన్నమైనది. ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఎన్నికల ప్రచారంలో హిందుత్వ, రామ మందిరం, మతధ్రువీకరణ, ఫాసిజం గురించి మాట్లాడితే ఇంకా ఎక్కువ మంది హిందువులు బీజేపీ గుప్పిట్లోకి చేరవచ్చు, తద్వారా బీజేపీ తిరిగి అధికారంలోకి రావచ్చు. అందువలన, హిందుత్వ రాముడి గురించి మాట్లాడే బదులు, బీజేపీ తాము హిందువులపార్టీ అని పైకిచెప్పుకుంటున్నప్పటికీ, బీజేపీ హిందూ వ్యతిరేక పార్టీ అనే నిజమైన దృక్పథాన్ని ప్రజలకు అందించాలి. అందువల్ల, 100 సంవత్సరాలుగా సంఘ్ పరివార్ చర్చిస్తున్న మతానికి సంబంధించిన విషయాల నుండి, జాతీయ చర్చను, బీజేపీ ప్రభుత్వం గత 10 సంవత్సరాలుగా భారతీయులందరిపై, ముఖ్యంగా 110 కోట్లకుపైగా ఉన్న అమాయక హిందువులపై, చేసిన ఆర్థిక విధ్వంసం వైపు దృష్టి మళ్లించాలి. భారతదేశంలో ఆర్థిక అసమానతలపై ఆక్స్‌ఫామ్ - 2022 నివేదికలో చెప్పిన ప్రకారం, దేశంలోని మొదటి 1% మంది సంపన్నులు జాతీయ సంపదలో 42.5%, 10% మంది సంపన్నులు 77% కలిగున్నారు. అయితే, దిగువ 50% ప్రజలు కేవలం 2.8% సంపద మాత్రమే కలిగున్నారు. 2021 లో ఉన్నతస్థానంలో ఉన్న మొదటి 1% మంది ధనికుల సంపద 46శాతం పెరగ్గా, దిగువ 50 శాతం ప్రజల సంపద 3శాతం మాత్రమే పెరిగింది. ఇటు వంటి దయనీయ పరిస్థితిలోనూ, 90శాతం భారతీయులను ఆర్థికంగా ఇబ్బంది పెట్టి అత్యంత సంపన్నులైన మొదటి10శాతం మందిని మరింత సంపన్నం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం 2014 నుండి కృషి చేస్తోంది. ఈ దుర్మార్గమైన ఆర్థిక విధానాల ద్వారా కూడగట్టుకున్న అపఖ్యాతిని కప్పిపుచ్చడానికి, బీజేపీ 80:20, అంటే దేశ జనాభాలో80% హిందువులు, 20% మైనారిటీలు, అనే దుర్బుద్ధితో కూడిన ఒకవిభజన ఆలోచనను ముందుకు తెచ్చింది. అంతే కాకుండా ద్వేషం, హింస, చట్టాల ద్వారా దేశాన్ని మతపరంగా ధృవీకరించి, అధిక సంఖ్యలో ఉన్న హిందువుల ఓట్లను తమకు అనుకూలంగా రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. బీజేపీ మతతత్వం, ఫాసిజం, చట్టాలు, విధానాలు, నిర్ణయాలు మైనారిటీలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా నాశనం చేయడమే కాకుండా, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి, పేద, నిరుపేద హిందువుల ఆర్థిక స్థితిని, జీవనోపాధిని కూడా నాశనం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎస్సీల, ఎస్టీల, ఓబీసీల, రైతుల, కార్మికుల, యువత, మహిళల, వయో వృద్ధుల జీవితాలను బీజేపీ తుంగలో తొక్కింది. గత దశాబ్దంలో హిందువుల (అగ్ర 10% మినహా) జీవితాలను మెరుగు పరచేందుకు బీజేపీ కృషి చేస్తున్నట్లుగా చేసే వాదనలు కేవలం అపోహలు మాత్రమే. నిజానికి, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అన్ని ప్రభుత్వాల కంటే ఎక్కువ మంది హిందు వులను పేదరికంలోకి నెట్టింది. ఈ బీజేపీ ప్రభుత్వమే. బీజేపీ ప్రభుత్వం హిందు వులకోసం పని చేస్తుందని చేసేప్రచారం ఒక బూటకపు కథనం. వాస్తవంగా బీజేపీ ఒక "హిందూ వ్యతిరేక" పార్టీ. బీజేపీ నకిలీ కథనాన్ని తిప్పి కొట్టడానికి అవసరమైన వాస్తవాలతో కూడిన కథనం క్రింద వివరించబడింది: జాతీయ ఆస్తులన్నీ వివిధ సమూహాలకు వారి జనాభా శాతం ప్రకారం చెందినవని భావిస్తే, బీజేపీ ప్రభుత్వం గత దశాబ్దంలో పెట్టుబడిదారులకు అప్పగించిన పన్ను చెల్లింపుదారుల ప్రతి100 రూపాయలలో, జాతీయ ఖనిజాలలో, అటవీ వనరులలో, ప్రజా మౌలిక సదుపాయాల ఆస్తులలో, 80 రూపాయలకంటే లేదా 80శాతం ఆస్తులకంటే ఎక్కువ హిందువులకు చెందినవని, 20 రూపాయలు కంటే లేదా 20శాతం ఆస్తుల కంటే తక్కువ మైనారిటీలకు చెందినవని అర్థమవుతుంది. భారతదేశంలో మైనారిటీలు వారి జనాభా శాతంతో పోలిస్తే అసమానంగా తక్కువ ఆర్థికస్థితిని, ఆస్తులను కలిగి ఉన్నారు. దీంతో బీజేపీ ప్రభుత్వచర్యలు హిందువులకు ఎక్కువ ఆర్థిక నష్టాన్ని కలిగించినట్లు నిరూపణ అవుతోంది. ప్రభుత్వరంగ సంస్థలను, మౌలిక సదుపాయాలను, అన్యాయంగా, తక్కువ ధరలకు ప్రైవేటీకరించడం. లీజుకు ఇవ్వడంవల్ల, ఈ సామాజిక ఆస్తుల్లో 80 శాతం వాటా కలిగిన హిందువులకు ఎక్కువ నష్టం జరుగుతుంది. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ, ప్రధానంగా, ఎస్సీ,ఎస్టీ,ఒబిసిల ఉపాధిని దెబ్బతీస్తుంది. ఎందుకంటే, కొనుగోలుచేసే ప్రైవేటు సంస్థలకు ఉద్యోగాలలో రాజ్యాంగ బద్ధంగా నిర్దేశించిన రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఉండకపోవచ్చు. తద్వారా బీజేపీ హిందువుల జీవనోపాధికి తీవ్రమైన హాని చేస్తుంది.

ప్రభుత్వరంగ బ్యాంకుల నుంచి పెట్టుబడిదారులు తీసుకున్న రూ.15.4 లక్షల కోట్ల రుణాలను బీజేపీ ప్రభుత్వం మాఫీ చేసింది. ఈ మొత్తాలు దిగువ, మధ్య తరగతి, వేతనజీవుల కష్టార్జితం. అంతేకాకుండా, నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకులకు పన్ను చెల్లింపుదారుల సొమ్ముతో మూలధనాన్ని సమ కూర్చింది. ఈ రెండు చర్యలవలన నష్టపోయిన వారిలో 80శాతం ప్రజలు హిందువులే. "నోట్ల రద్దు" సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగాన్ని, చిన్న వ్యాపారాలను నాశనం చేసింది. లక్షలాది దిగువ, మధ్యతరగతి, పేద ప్రజలు ఉద్యోగాలు కోల్పోయారు. అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకున్నారు. వారిలో 80శాతం మంది హిందువులు. అయితే, ఈ ప్రక్రియ వలన "నల్ల ధనం" వెలికి తీయలేదని రద్దు చేసిన నోట్లన్నీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి తిరిగి రావడంవలన నిరూపణ జరిగింది. దేశంలోని ఎక్కువసాగు భూమి హిందూ రైతుల యాజమాన్యంలో ఉంది, లక్షలాది హిందూ కౌలు రైతులే సాగు చేస్తున్నారు. బీజేపీ ప్రభుత్వ "నల్ల వ్యవసాయ చట్టాలు" హిందూ రైతుల ప్రయోజనాలను తాకట్టు పెట్టి కార్పొ రేట్‌లకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ఉన్నాయి. పెరిగిన ముడి సరుకుల ఖర్చులు, సరిపోని రుణ సదుపాయాలు, ప్రకృతి వైపరీత్యాలు, సహాయపడని బీమా పథకం, ధరల అస్థిరత హిందూ రైతుల ఆత్మహత్యలకు దారి తీస్తున్నాయి. ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను 30శాతం నుండి 22శాతానికి తగ్గించటం వలన పెట్టుబడిదారులకు లాభం, ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరిగింది. అయితే, అదనపు పెట్టుబడులుగాని, కొత్త ఉద్యోగాల కల్పనగాని జరగలేదు తద్వారా, యువత అనేక విధాలుగా నష్టపోయింది. బీజేపీ ప్రభుత్వం జీఎస్‌టీ పరిధిని, రేట్లను పెంచి దోపిడీ పన్ను విధానం అవలంబిస్తోంది. ఆరోగ్యం, విద్యా రంగాలను విస్మరించిందిబీ పేదల ఉపాధి పథకాలకు నిధులను తగ్గిం చింది. కొత్త లేబర్ కోడ్‌లతో పారిశ్రామిక వేత్తలకు సహాయంచేసి కార్మికులకు హాని కలిగించింది. నిత్యావసర వస్తువులైన కిరాణా, ఇంధనం, గ్యాస్, వివిధ సేవలైన రవాణా, విద్యుత్ ధరలను పెంచి మధ్య, దిగువ, పేద వర్గాలను దెబ్బతీసింది. మైనారిటీలు, దళిత మహిళలపై నేరాలు పెరిగాయి. పైన వివ రించిన ప్రభుత్వ చర్యల బాధితుల్లో 80శాతం హిందువులే. పైన వివరించిన బీజేపీ ప్రభుత్వచర్యలు, సంపన్నులను మిన హాయించి, మైనారిటీలకు అన్ని రకాలుగా దేశ జనాభాలో 80% ఉన్న హిందువులలోని ప్రతి వర్గానికి ఆర్థికంగా, తీవ్రమైన హాని కలిగించింది. అయితే, బీజేపీ యావత్ ప్రపంచానికి తమ పార్టీ "హిందూ అనుకూల పార్టీ" అని చెప్పుకుంటోంది. ఈ నేపథ్యంలో, హిందువులు మాత్రమే అధికారంలోఉన్న బీజేపీ (బీజేపీలో ముస్లింలు అధికార స్థానాల్లో లేరు) హిందువులకే అపారమైన హానిని కలిగిస్తున్న విషయం దిగ్భ్రాంతికరం. తద్వారా, బీజేపీ 'హిందూ వ్యతిరేక' పార్టీ అని నిస్సందేహంగా నిర్ధారణ అయింది. కాబట్టి, బీజేపీ ప్రభుత్వ ఫాసిజానికి, మతతత్వానికి, "హిందూ వ్యతిరేక తత్వానికీ" వ్యతిరేకంగా శక్తివంతంగా కలిసి పోరాడుదాం, మన దేశాన్ని, ప్రజలను, కుల మత వివక్ష లేకుండా కాపాడు కుందాం. విద్యావంతులు, మేధావులు, దేశభక్తులు, పౌర సమాజ సమూహాలు, ప్రతిపక్ష పార్టీలు ఈ ప్రయత్నంలో ఒక ముఖ్య భూమిక పోషించవలసిన అవ సరముంది. 1984లో జార్జ్ ఆర్వెల్ చిత్రీకరించిన డిస్టోపియన్ సమాజంగా మన ప్రియమైన భారతదేశం మారకుండా చూసుకుందాం.

ఏపీకి బీజేపీ ఏమి చేసింది?

టి.వి.సుబ్బయ్య

ఏదో ఒక పార్టీతో పొత్తు కుదుర్చుకొని ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ పోట చేస్తుందన్న వార్తలు వస్తున్నాయి. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీలలో ఒక్కటైనా నెరవేర్చిందా? ఈ ప్రశ్న ఆ పార్టీ నాయకులు తమకుతాము వేసుకుంటే ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చలేదన్న జవాబు వస్తుంది? రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదా ఇస్తామని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ హామీ ఇచ్చారు. అప్పుడు రాజ్యసభలో బీజేపీ నాయకులు వెంకయ్యనాయుడు తదితరులు తాము అధికారంలోకివస్తే ఐదేళ్లు కాదు, పదేళ్లు ఇస్తామని చెప్పారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు 2014 అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. అమరావతిని రాజధానిగా ప్రకటించి అసెంబ్లీ, కోర్టులు తదితర కొన్ని భవనాలు కట్టించారు. రాజధాని నిర్మాణాలకు శంకుస్థాపన చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వచ్చారు. వస్తూ కలిషిత గంగానది నీళ్లు తెచ్చారు. ఒక ఇటుకవేసి శంకుస్థాపనచేసి వెళ్లారు. రాజధాని నిర్మాణానికి ఎక్కువ నిధులు అవసరం. అయినప్పటికీ మోదీ సహాయంగా నిధులను ప్రకటించలేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి రాజధాని ఏర్పాటు కష్టమైనపని. రాజధాని నిర్మాణానికి సరైన ప్రాంతాన్ని నిర్ణయించడానికి శ్రీ కృష్ణకమిషన్ అధ్యయనంచేసి సూచించిన ప్రాంతాన్ని ఎన్నుకోలేదు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు సందర్భంగా విజయవాడ రాజధానిగా ఏర్పాటు చేయాలని భావించి, విశాలాంధ్ర అని పేరుపెట్టి మళ్లీ అంతర్గత రాజకీయాల కారణంగా అది సాకారం కాలేదు. 2014లో అంతకుముందు ఎన్నికల ప్రచారం సందర్భంగా మోదీ తిరుపతిలో జరిగిన సభలో బీజేపీ గెలిస్తే తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ప్రకటిస్తానని ప్రకటించారు. తిరుపతిలో ఉండే వెంకటేశ్వరస్వామి దేవుడిగా ఆరాధించే మోదీ ఇచ్చినమాట, చేసిన వాగ్దానాన్ని అమలు చేయ కుండా రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. ప్రత్యేక హోదా ప్రకటించి ఉన్నట్లయితే ఖచ్చితంగా రాష్ట్రం అభివృద్ధి జరిగిఉండేది. అప్పుడు చంద్రబాబు ప్రత్యేక ప్యాకేజీ అయినా ఇవ్వాలని కోరారన్న వార్తలు వచ్చాయి. ఆంధ్రరాష్ట్ర ప్రజలకు చేసినంత

అన్యాయం మరెవరూ చేయలేదు. మోదీ అధికారం చేపట్టిన నాటినుంచి ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని అనుసరించడానికి, కార్పొరేట్లను పెంచడానికి సమయం కేటాయించారు. అత్యంత ముఖ్యమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం సుదీర్ఘకాలంగా కొనసాగుతూనే ఉంది. ఈ విషయంలోనూ మోదీ ప్రభుత్వం అన్యాయం చేసింది. ఇందులోనూ రాజకీయ పితలాటం చోటు చేసుకున్నదని సందేహాలు వ్యక్తమయ్యాయి. నిర్మాణ బాధ్యతను కేంద్రం నుంచి చంద్రబాబే కావాలని తీసుకున్నారన్న వదంతులు వచ్చాయి. అందరూ కలిసి పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఈ నాటికీ పూర్తిగాకుండా చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు రాష్ట్రానికి ఇచ్చిన హామీల విషయంలో ఏరోజైనా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడానికి, తద్వారా రాష్ట్ర ప్రజలకు మేలు కలగడానికి ప్రయత్నించారా? ప్రాజక్టు ఎప్పటికి పూర్తవుతుందో ఎవరూ చెప్పే స్థితిలో లేరు. ఇక కాంగ్రెస్ హయాంలో 1967లో రాష్ట్రంలో ఉక్కు ఫ్యాక్టరీని ఇవ్వాలని గొప్పపోరాటం జరిగింది. ఈ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ప్రముఖపాత్ర వహించాయి. రాష్ట్ర ప్రజలంతా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుడు పొట్టి శ్రీరాములు నిరాహారదీక్ష చేసి తనప్రాణాలు అర్పించారు. కమ్యూనిస్టు పార్టీలకు చెందిన 31 మంది ఎంఎల్ఏలు, నలుగురు ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసి ఉక్కు ఉద్యమంలోకి దిగి నిరంతరం కృషిచేశారు. అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఫ్యాక్టరీని ప్రకటించారు. ప్రకటించిన తర్వాత కూడా చాలా కాలానికి ఇందిరాగాంధీ రాష్ట్రానికి వచ్చి శంకుస్థాపన చేసి ఫ్యాక్టరీకి కేవలం ఐదువేలకోట్ల రూపాయలు మాత్రమే ప్రకటించారు. అప్పటికీ రాష్ట్రంలోనే ఉన్న సింగరేణికి బొగ్గుగనుల నుంచి బొగ్గును కేటాయించలేదు. ఆ తర్వాత నేటికీ ఎలాంటి సహాయం అందకపోగా ఫ్యాక్టరీని ప్రైవేటువ్యక్తులకు అమ్మడానికి బీజేపీ ప్రభుత్వం నిర్ణయిం చింది. ఫ్యాక్టరీని అమ్మవద్దని, ప్రభుత్వరంగ సంస్థగానే ఉంచాలని సంవత్స రానికి పైగా ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల తరఫున ఏఐటీయూసీ, సీఐటీయు తదితర యూనియన్లు ఇతర చిన్నచిన్న యూనియన్లు ఆందోళన చేస్తున్నాయి. అయితే మోదీ దేశంలో సామాన్యులను అన్యాయంచేసి కార్పొ రేట్లను పెంచి పోషించేలా పాలన చేస్తున్నారు. దేశంలో మత రాజ్యాన్ని తయారు చేయాలని కంకణం కట్టుకున్నారు. క్రమంగా రాజ్యాంగాన్ని, స్వాతంత్ర్యానికి స్వస్తి పలికి హిందూమత ఆధిపత్య సమాజాన్ని తీసుకు రావాలని చూస్తున్నారు. రాష్ట్రంలోని రాయలసీమ, ఉత్తరాంధ్రలో ఏడు జిల్లాలకు ఐదువందల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాలు ఇస్తానని మోదీ చేసిన వాగ్దానాలలో ఒకటి. మొదట్లో 50కోట్లు ఇచ్చి ఆ తర్వాత దాని ఊసే ఎత్తలేదు. అలాగే కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తానన్న మోదీ పట్టించుకోలేదు. ఫ్యాక్టరీ కోసం రాష్ట్రంలో వామపక్షాలు మాత్రమే ఉద్యమం చేశాయి. విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు చేస్తామని వాగ్దానంచేసి ఇప్పుడు ఇతర ప్రాంతానికి కేటాయించాలని చూస్తున్నారు. ఏ వాగ్దానాన్ని రాష్ట్రంలో అమలుచేసిన దాఖలాలేదు. రాష్ట్రంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటుకు సహకరించారు. ఈ అంశాలలో ప్రధాన ప్రతిపక్షాలు ఉద్యమాలు చేయడానికి సిద్ధపడలేదు. మోదీ ఎన్నికల ప్రచారసభలో కొత్తని నాదాలు చేయడంలో, వాగ్దానాలు చేయడంలో మొనగాడు. రాష్ట్రానికి అన్ని విధాలుగా మోసం చేసినా రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్షాలు బీజేపీతో పొత్తుకోసం తహతహలాడటం విచిత్రం. వందలకుపైగా లక్షల కోట్ల అప్పులు చేసి అభివృద్ధిని విస్మరించి యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా కార్మికులను, కర్షకులకు ద్రోహం చేస్తున్న కేంద్రంలో మళ్లీ అధికారం కావాలని టక్కుటమార విద్యలు ప్రదర్శిస్తున్న బీజేపీకి రాష్ట్రంలో ఓట్లు పెరగనీయడం ఓటర్లు తమకు తామే అన్యాయం చేసుకున్న వారవుతారు. తనమీద కేసులున్నాయి గనక జగన్‌మోహన్‌రెడ్డి అన్నిటికీ మోదీకి లొంగి ఉంటున్నారు. మరి ప్రతిపక్షాలు ఎందుకు దగ్గర కావాలని ఆతృత పడుతున్నాయి?

‘అగ్నిపథ్’తో యువతకు అన్యాయం

- అధికారంలోకి వస్తే రద్దు చేస్తాం...
- పాత నియామక విధానం చేపడతాం
- కాంగ్రెస్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ‘అగ్నిపథ్’ సైనిక నియామక పథకం వల్ల యువకులకు ‘తీవ్రమైన అన్యాయం’ జరిగిందంటూ కాంగ్రెస్ పార్టీ సోమవారం కేంద్ర ప్రభుత్వంపై దాడి చేసింది. కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే పాత నియామక విధానాన్ని తిరిగి తీసుకువస్తుందని నొక్కి చెప్పింది. ఇప్పటికే నియామక ప్రక్రియను ఆమోదించిన సుమారు రెండు లక్షల మంది యువకులకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. అయితే 2022లో ‘అగ్నిపథ్’ పథకం ప్రారంభించినందున ఉద్యోగంలో చేరేందుకు లేఖలు ఇవ్వలేదు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ‘అగ్నిపథ్’ పథకం కారణంగా సాయుధ దళాలలో శాశ్వత ఉపాధిని కోరుకునే యువకులకు జరిగిన ‘తీవ్ర అన్యాయాన్ని’ ఎత్తి చూపారు. వారికి న్యాయం జరిగేలా చూడాలని ఆమెను కోరారు. సాయుధ దళాలలో శాశ్వత నియామక ప్రక్రియను రద్దు చేయడం వల్ల దాదాపు రెండు లక్షల మంది యువతీ యువకుల భవిష్యత్ అనిశ్చితంగా మారిందని, సాయుధ దళాలకు సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతికి ఖర్గే రాసిన లేఖలో పేర్కొన్నారు. ‘అగ్నిపథ్ పథకంలో చాలా తీవ్ర సమస్యలు ఉన్నాయి. సైనిక దళాల ప్రధానాధికారి ఎం.ఎం.నరవాణే అగ్నిపథ్ ద్వారా సైన్యాన్ని ‘ఆశ్చర్యానికి గురిచేసింది. ‘నావికా దళం, వైమానిక దళం కోసం ఇది నీలి రంగు నుంచి ఒక చీల లాగా వచ్చింది’ అని తెలిపారు. ‘అంతేకాకుండా వారు ఒకే విధమైన పనులపై పనిచేయాలని ఆశించే సైనికుల సమాంతర కేడర్‌లను సృష్టించడంపై ఈ పథకం మన జవాన్ల మధ్య వివక్షను చూపుతుంది. కానీ చాలా భిన్నమైన పారితోషికాలు, ప్రయోజనాలు, అవకాశాలతో ఉన్నారు. మెజారిటీ అగ్నివీర్లు నాలుగు సంవత్సరాల తర్వాత అనిశ్చిత ఉద్యోగ మార్కెట్‌లోకి వస్తారు. సేవ, సామాజిక స్థిరత్వంపై ప్రభావం చేస్తుందని కొందరు వాదించారు’ అని ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే లేఖను ట్యాగ్ చేస్తూ, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదిక ‘ఎక్స్’ లో చేసిన ఒక పోస్ట్‌లో... ‘న్యాయం కోసం పోరాటంలో మేము దేశభక్తి, ధైర్యసాహసాలతో నిండిన సైనిక అభ్యర్థులతో ఉన్నాము’ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా ‘ఎక్స్’లో చేసిన పోస్ట్‌లో... దేశభక్తి, సేవా స్ఫూర్తితో దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువకులు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్నారని అన్నారు. చలిగానీ, ఎండలోగానీ, వర్షంగానీ తెల్లవారుజామునే నిద్రలేచి పరుగు పరుగెత్తుతూ... సైన్యంలో చేరి దేశానికి సేవ చేస్తామని, ఉపాధి కూడా పొందుతామని భావించారు. కానీ అగ్నివీర్ పథకాన్ని తీసుకురావడం ద్వారా లక్షలాది మంది యువత కలలను బీజేపీ ప్రభుత్వం తుడిచిపెట్టేసిందని తెలిపారు. ‘లక్షలాది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కోట్లాది మంది యువత నిరుద్యోగులకు ఇది మోదీ గ్యారెంటీ’ అని ఆమె పేర్కొన్నారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ మాట్లాడుతూ అలాంటి పథకానికి ఎలాంటి డిమాండ్ లేదని అన్నారు. ‘దీర్ఘకాలికంగా ఈ పథకం భారత ప్రభుత్వానికి కొంత డబ్బు ఆదా చేయడం తప్ప ఎవరికీ ప్రయోజనం కలిగించదు. కాంగ్రెస్ పార్టీగా మేము పాత నియామక విధానానికి తిరిగి వెళ్లాలని భావిస్తున్నాము’ అని పైలట్ చెప్పారు. సాయుధ బలగాలను ఆధునీకరించేందుకు కొన్ని మార్పులు తీసుకురావాలంటే, ప్రస్తుత ఏర్పాటులో అది చాలా సాధ్యమేనని, అయితే పాత వ్యవస్థను పూర్తిగా నిర్మూలించడం సరికాదన్నారు. ‘ఇది ఉపాధి మార్గాలను మూసివేస్తోంది. సైన్యం ఎలా పనిచేస్తుందనే భవిష్యత్ అవకాశాల గురించి పెద్దగా ఆలోచించకుండా ఇది తాత్కాలిక పద్ధతిలో జరిగిందని నేను భావిస్తున్నాను. అగ్నిపథ్ కార్యక్రమం సానుకూల పరిణామం కాదని కాంగ్రెస్‌లో మేము విశ్వసిస్తున్నాము. ప్రజలు మాకు తిరిగి ఓటు వేసిన తర్వాత మేము కచ్చితంగా పాత నియామక విధానానికి తిరిగి వెళతాము’ అని పైలట్ చెప్పారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు పవన్ ఖేరా, దీపేందర్ హుడా ఉన్నారు. హుడా మాట్లాడుతూ కోవిడ్-19 మహమ్మారి వ్యాప్తి చెందుతున్న సమయంలో, ముందు అనేక సైనిక నియామక ప్రక్రియలు పూర్తయ్యాయని, చేరడం మాత్రమే మిగిలి ఉందని హుడా చెప్పారు. కానీ ‘అగ్నిపథం’ పథకం ప్రవేశపెట్టిన తర్వాత, ప్రభుత్వం ఎంపిక చేసిన ఈ యువకులకు జాయినింగ్ లెటర్‌లు ఇవ్వలేదు. ‘ఈ యువకులు (కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు) రాహుల్ గాంధీని కలుసుకున్నారు. వారి బాధను పంచుకున్నారు. అప్పటి నుంచి రాహుల్‌జీ నిరంతరం తన స్వరాన్ని పెంచుతున్నారు’ అని ఆయన తెలిపారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ఎవరి డిమాండ్‌పై ‘అగ్నిపథ్ పథకం’ తీసుకువచ్చిందని కూడా హుడా ప్రశ్నించారు. ‘సైన్యం లేదా సైన్యంలో చేరాలనుకున్న యువకులు ఈ పథకం కోసం డిమాండ్‌ను ముందుకు తీసుకురాలేదు’ అని అన్నారు. ‘నాలుగు సంవత్సరాల సేవ తర్వాత అగ్నివీర్‌లు ఏమి చేస్తారని మేము అడిగినప్పుడు ఆ యువకులకు బీజేపీ కార్యాలయంలో వాచ్‌మెన్‌గా ఉద్యోగం ఇస్తామని బీజేపీ నాయకుడు కైలాష్ విజయవర్గియా అన్నారు. ‘దేశంలోని యువకులు దేశభక్తితో సైన్యంలో చేరతారు తప్ప బీజేపీ కార్యాలయం బయట వాచ్‌మెన్‌గా మారాలనే భావనతో కాదని బీజేపీకి చెప్పాలనుకుంటున్నాను’ అని హుడా అన్నారు. రాష్ట్రపతికి రాసిన లేఖలో ఖర్గే... తాను ఇటీవల బాధిత యువకులను కలిశానని, 2019-2022 మధ్య, దాదాపు రెండు లక్షల మంది యువకులు, యువతులు మూడు సాయుధ సేవల్లోకి అంగీకరించినట్లు సమాచారం అందిందని వారు చెప్పారు. ‘ఈ యువకులు, మహిళలు కఠినమైన మానసిక, శారీరక పరీక్షలు, రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించడానికి అన్ని అసమానతలకు వ్యతిరేకంగా పోరాడారు. 31 మే, 2022 వరకు వారు తమ కలలను నెరవేర్చుకున్నారు. జాయినింగ్ లెటర్ల కోసం మాత్రమే ఎదురుచూస్తున్నారని వారు విశ్వసించారు. ఈ నియామక ప్రక్రియను ముగించి, అగ్నిపథ్ పథకంతో భర్తీ చేయాలనే భారత ప్రభుత్వం నిర్ణయంతో ఆ రోజు వారి కలలు చెదిరిపోయాయి. మా యువతను ఈ విధంగా బాధపెట్టడానికి అనుమతించలేము. న్యాయం జరిగేలా చూడాలని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాన్నాను’ అని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ‘అగ్నిపథ్’ పథకం 17 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాల వయస్సు గల యువకులను నాలుగు సంవత్సరాల కాలానికి నియామకం చేసుకోవడానికి నిర్ణయించారు. వారిలో 25 శాతం మందిని మరో 15 సంవత్సరాల పాటు కొనసాగించాలనే నిబంధన ఉంది.

ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మరోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు గైర్హాజరయ్యారు. దర్యాప్తు సంస్థ సమన్ల ప్రకారం సోమవారం ఆయన ఈడీ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండగా... తాను హాజరుకావడం లేదని సీఎం సమాచామిచ్చారు. ఆయన ఇలా విచారణకు గైర్హాజరుకావడం ఇది ఏడోసారి. ‘ప్రస్తుతం ఈ అంశం కోర్టు పరిధిలో ఉంది. మార్చి 16న విచారణ జరగనుంది’ అని ఆప్ వెల్లడించింది. దర్యాప్తు సంస్థ న్యాయ ప్రక్రియను గౌరవించాలని పేర్కొంది. పదేపదే సమన్లు జారీ చేయడం సరికాదని, కోర్టు ఆదేశాలు వెలువడే వరకు ఓపికతో వేచి ఉండాలని కోరింది. మద్యం కుంభకోణం కేసులో విచారణ నిమిత్తం జారీ చేసిన నోటీసులకు సీఎం స్పందించకపోవడంతో ఈడీ కొద్దిరోజుల క్రితం కోర్టును ఆశ్రయించింది. ఈ ఫిర్యాదుపై ఇటీవల న్యాయస్థానం నోటీసులు జారీ చేయడంతో కేజ్రీవాల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. ఆయన అభ్యర్థన మేరకు తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. మద్యం కుంభకోణం కేసులో ఇప్పటికే సీబీఐ కేజ్రీవాల్‌ను విచారించింది. గతేడాది ఏప్రిల్‌లో 9 గంటల పాటు అధికారులు ప్రశ్నించారు. తాజాగా ఈడీ నమోదు చేసిన కేసులోనూ వరుసగా సమన్లు అందుతున్నాయి. ఇదే కేసులో ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ జైల్లో ఉన్నారు.

పరువునష్టం కేసులో కేజ్రీవాల్ క్షమాపణ

పరువుకు భంగం కలిగించే వీడియోను రీట్వీట్ చేసి తప్పు చేశానని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం సుప్రీంకోర్టు ఎదుట అంగీకరించారు. ఒక పరువునష్టం కేసులో తనకు జారీ అయిన సమన్లను ఢిల్లీ హైకోర్టు సమర్థించడాన్ని సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంను ఆశ్రయించగా దానిపై విచారణ జరిగింది. ఈ క్రమంలో ఆయన క్షమాపణ చెప్పారు. కేజ్రీవాల్ తన తప్పు అంగీకరించడంతో ఈ కేసును ఇక్కడితో మూసివేయాలనుకుంటున్నారా అని కోర్టు ఫిర్యాదుదారుడిని ప్రశ్నించింది. అలాగే ఈ కేసులో మార్చి 11 వరకు విచారణ కోర్టు ఎలాంటి విచారణ చేపట్టవద్దని ఆదేశించింది. యూట్యూబర్ ధ్రువ్ రాఠీ 2018 మే నెలలో రూపొందించినట్లు చెబుతున్న ఒక వీడియోను కేజ్రీవాల్ తిరిగి ట్వీట్ చేసినందుకు క్రిమినల్ కేసు దాఖలైంది. ఒకరిని కించపరిచేలా ఉన్న వీడియోను ఇతరులకు పంపడం పరువునష్టం చట్టం కింద నేరమే అవుతుందని, అలాంటి విషయాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హైకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టు సమన్లు కొట్టివేయడానికి నిరాకరించింది. దీనిపై కేజ్రీవాల్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

యూపీలో పదో సీటు కోసం
బీజేపీ, ఎస్పీ హోరాహోరీ



లక్నో: ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికలు మంగళవారం జరుగనున్నాయి. అదనపు సీటు కోసం బీజేపీ ప్రయత్నిస్తుండగా, ప్రధాన పోటీ మాత్రం బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే, సమాజ్‌వాదీ పార్టీ మధ్య నెలకొంది. మొత్తం 10 సీట్లలో ఎన్నికలు జరుగు తుండగా, 11 మంది అభ్యర్థులు బరిలో ఉండటంతో పోటీ అనివార్యమైంది. 10వ సీటును ఎవరు దక్కించు కోనున్నారనే ఉత్కంఠ నెలకొంది. బలాబలాల ఆధారంగా ఏడుగురు బీజేపీ అభ్యర్థులు, ఇద్దరు సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థుల గెలుపు ఖాయమైంది. బీజేపీ అదనంగా ఒక అభ్యర్థిని బరిలోకి దింపడంతో పదో సీటు కోసం పోటీ తప్పనిసరి అయింది. ఒక్కో అభ్యర్థిని గెలిపించుకోవాలంటే 37 చొప్పున ఓట్లు అవసర మవుతాయి. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీలో 403 సీట్లు ఉండగా 4 సీట్లు ఖాళీగా ఉన్నాయి. బీజేపీ ఎనిమిదో సీటు గెలుచుకోవాలంటే మరో 9 మంది సభ్యుల ఓట్లు అవసరమవుతాయి. ఎన్డీయేకు (బీజేపీ, ఆర్ఎల్‌డీ, అప్నాదల్ ఎస్, నిషాద్ పార్టీ, ఎస్‌బీఎస్‌పీ, జనసత్తా దళ్ (లోక్‌తాంత్రిక్)కు 288 మంది శాసన సభ్యులు ఉన్నారు. ఎస్‌బీఎస్‌పీకి చెందిన ఒక ఎమ్మెల్యే జైలులో ఉండటంతో వారి బలం 287కి పడిపోయింది. ఇటీవలే బీజేపీలో చేరిన రితేశ్ పాండే తన తండ్రి రాకేశ్ పాండే ఓటును బీజేపీకి అనుకూలంగా వేయించవచ్చనే ఊహాగానాలు ఉన్నాయి. రాకేశ్ పాండే సమాజ్‌వాదీ పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఈ లెక్కన బీజేపీకి మరో 8 మంది ఎమ్మెల్యేల అవసరం ఉంది. మరోవైపు, సమాజ్‌వాదీ పార్టీ మూడో అభ్యర్థిని గెలిపించుకోవాలంటే వారికి కేవలం మూడు ఓట్లు అవసరమవుతాయి. ఎస్పీ, కాంగ్రెస్‌లకు 110 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఎస్‌పీ ఎమ్మెల్యేలు రామాకాంత్ యాదవ్, ఇర్ఫాన్ సోలంకి జైలులో ఉన్నారు. ఈ లెక్కన ఎస్పీకి మరో ముగ్గురు శాసనసభ్యుల అవసరం ఉంది. ఎస్పీ ఎమ్మెల్యే రాకేశ్ పాండే బీజేపీ అభ్యర్థికి ఓటు వేస్తే నాలుగు ఓట్లు అదనంగా ఎస్పీకి అవసరమవుతాయి. ఈ క్రమంలో పదో సీటును ఏ పార్టీ కైవసం చేసుకుంటుందనేది ఉత్కంఠ కలిగిస్తోంది. ‘క్రాస్ ఓటింగ్’ పైనే అందరి దృష్టి ఉంది.

గిరిజనుల దుస్థితిపై కేంద్రం, బెంగాల్‌కు నోటీసులు

న్యూఢిల్లీ: బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, మానవ-వన్యప్రాణుల సంఘర్షణ, రాష్ట్రంలోని సుందర్‌బన్స్ ప్రాంతాన్ని పీడిస్తున్న అవినీతి సమస్యలపై వాస్తవ, చర్య తీసుకున్న నివేదికలను కోరుతూ షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ (ఎన్‌సీఎస్‌టీ) కేంద్రానికి, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. హక్కుల కార్యకర్త, సుప్రీం కోర్టు న్యాయవాది రాధాకాంత త్రిపాఠి వాదన మేరకు కమిషన్ గత వారం నోటీసులు జారీ చేసింది. ఈ ప్రాంతంలోని గిరిజన జనాభా (2,11,927), ప్రాథమికంగా ముండా, సంతాల్, భూమిజ్, ఒరాన్ తెగలు, తొలి స్థిరనివాసులు అయినప్పటికీ అట్టడుగున ఉన్నారని త్రిపాఠి ఎన్‌సీఎస్‌టీ తరపున తెలిపారు. ప్రత్యేకమైన మడ అడవులకు ప్రసిద్ధి చెందిన బంగాళాఖాతంలోని లోతట్టు ద్వీపాల సమూహమైన సుందర్‌బన్స్‌లో బాల్య వివాహాలు ప్రబలంగా ఉన్నాయని ఆయన ఎత్తిచూపారు. ఆడపిల్లలకు 15 నుంచి 16 ఏళ్లలోపు పెళ్లిళ్లు జరగడం సర్వసాధారణం. హస్నాబాద్ పంచాయతీలో ఏటా 15 తక్కువ వయస్సు గల వివాహాల కేసులు నమోదవుతున్నాయని త్రిపాఠి పేర్కొంటూ, సంప్రదాయవాద వైఖరులు బాల్య వివాహాలు అధిక రేటుకు దోహదం చేస్తున్నాయని అన్నారు. మానవ అక్రమ రవాణా ప్రధాన ఆందోళన కలిగిస్తోందని, తప్పిపోయిన మహిళలు, బాలికల సంఖ్యలో పశ్చిమ బెంగాల్ రెండవ స్థానంలో ఉందని కార్యకర్త చెప్పారు. జాతీయ నేర నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) ప్రకారం, 2019-20లో రాష్ట్రంలో 1,56,905 మంది మహిళలు, 36,606 మంది బాలికలు అదృశ్యమయ్యారు. ‘మహిళల అక్రమ రవాణాదారులు ఆర్థిక అవసరాలు, పనిచేయని కుటుంబాలు, శృంగార సంబంధాలు, మానసిక రుగ్మతలు కలిగి ఉన్న వారిని దోపిడీ చేస్తారు. ఉత్తర 24 పరగణాల గ్రామాలలో విద్య లేకపోవడం, పేద సామాజిక-ఆర్థిక పరిస్థితులు ప్రధాన కారకాలు’ అని వివరించారు. కాగా, 100కి పైగా పులులు నివసించే భారతీయ సుందర్‌బన్స్‌లో ఆదివాసీల మనుగడ కోసం జరుగుతున్న పోరాటం పర్యావరణ సవాళ్లతో తీవ్రరూపం దాల్చిందని, ఇది మానవ-జంతు సంఘర్షణలకు, బాధిత కుటుంబాలకు కష్టాలకు దారితీస్తుందని హక్కుల కార్యకర్తలు తెలిపారు. తూర్పు కోల్‌కతా వెట్‌ల్యాండ్స్, సుందర్‌బన్స్‌తో సహా రామ్‌సర్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు, పర్యావరణ ఉల్లంఘనలు కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ (కాగ్) ఇటీవలి ఆడిట్ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించిందని ఆయన ఎత్తి చూపారు. సుందర్బన్స్ నివాసితులకు సురక్షితమైన తాగునీరు, వైద్యం, విద్య, సరైన మౌలిక సదుపాయాలు వంటి అవసరమైన సేవలు అందుబాటులో లేవని, వారి జీవించే హక్కు, ప్రాథమిక సౌకర్యాలను ఉల్లంఘిస్తున్నారని త్రిపాఠి ఆరోపించారు. సాంఘిక సంక్షేమ పథకాల అమలు సరిగా లేకపోవడంతో అట్టడుగు వర్గాల ప్రజల కష్టాలు మరింత తీవ్రమవుతున్నాయని ఆయన అన్నారు. ఈ అంశంపై అధికారుల బృందంతో సమగ్ర విచారణ జరిపి, ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్లు, పర్యావరణ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖల నుంచి సమగ్ర నివేదికలు అందించాలని న్యాయవాది అభ్యర్థించారు.

జరిమానా కోసం జయ ఆస్తుల వేలం

చెన్నై: జరిమానా చెల్లించేందుకు దివంగత ముఖ్యమంత్రి జయలలితకు చెందిన 28 కిలోల బంగారు నగలు వేలం వేయనున్నారు. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జయలలితకు 2014లో నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.100 కోట్ల జరిమానా విధించిన బెంగళూరు కోర్టు శశికళ, ఇళవరసి, సుధాకరన్‌లకు నాలుగేళ్ల జైలు శిక్ష, 10 కోట్ల చొప్పున జరిమానా వేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ నలుగురు కర్నాటక హైకోర్టులో అప్పీల్ చేయగా అనుకూలంగా తీర్పు వచ్చింది. తర్వాత కర్నాటక ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ సమయంలో 2016 డిసెంబరు 5న జయలలిత మరణించారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు బెంగళూరు ప్రత్యేక కోర్టు తీర్పును సమర్థించింది. జయలలిత మరణించి ఆరేళ్లుకాగా ఆమె చెల్లించాల్సిన జరిమానా కట్టేందుకు ఎవరూ ముందుకురాలేదు. దీంతో ఆమె ఆస్తులు అమ్మి జరిమానా చెల్లించేందుకు చర్యలు చేపట్టారు. ఆమె ఇంట్లో అవినీతి నిరోధకశాఖ స్వాధీనం చేసుకున్న 28 కిలోల బంగారు, 800 కిలోల వెండి నగలు, ఇతర వజ్రాభరణాలను కోర్టులో అప్పగించారు. ఈ నగలు వేలం వేసి వచ్చిన నగదుతో జరిమానా చెల్లించాలని నిర్ణయించారు. అందుకోసం నగలను మార్చి 6, 7న తమిళనాడు తీసుకొచ్చి హోంశాఖ కార్యదర్శికి అప్పగించనున్నారు. వాటికి ప్రస్తుత విలువ నిర్ణయించి వేలం వేయనున్నారు. ఈ నగలే రూ.40 కోట్ల వరకు ధర పలకనున్నాయి. మిగిలిన రూ.60 కోట్లకు స్థిరాస్తులు వేలం వేయడానికి చర్యలు చేపట్టారు. అక్రమంగా సంపాదించిన బంగారు, వజ్రాభరణాలను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించేందుకు ఇటీవల బెంగళూరు కోర్టు తేదీని నిర్ణయించింది. మార్చి 6,7 తేదీల్లో ఆ ఆభరణాలు తీసుకోవడానికి 6 ట్రంకు పెట్టెలతో రావాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ కేసును విచారించిన సివిల్ అండ్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి తేదీలు ప్రకటిస్తూ, ఆ రెండు రోజుల్లో ఇతర కేసుల విచారణ చేపట్టకూడదని నిర్ణయించారు.

తృణమూల్ నేత షాజహాన్‌పై ఆంక్షల్లేవ్
కలకత్తా హైకోర్టు

కోల్‌కతా: పరారీలో ఉన్న తృణమూల్ కార్యకర్త, ఉత్తర 24 పరగణాల జిల్లా పరిషత్ కార్యకర్త షేక్ షాజహాన్‌ను అరెస్టు చేయడానికి బెంగాల్ పోలీసులపై ఎటువంటి ఆంక్షలు లేవని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సోమవారం తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి డివిజన్ బెంచ్ జారీ చేసిన స్టే ఆర్డర్ కారణంగా రాష్ట్ర పోలీసులు షాజహాన్‌ను అరెస్టు చేయలేకపోయారని తృణమూల్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఆదివారం అన్నారు. షాజహాన్‌కు సంబంధించిన మరో కేసుపై సోమవారం విచారణ సందర్భంగా, షాజహాన్‌ను అరెస్టు చేయడంపై స్టే లేదని కోర్టు స్పష్టం చేసింది. ‘ఏ ప్రక్రియలోనూ అరెస్టుపై స్టే లేదని మేము స్పష్టం చేస్తున్నాము. గతంలో ఏర్పాటయిన ప్రత్యేక దర్యాప్తు బృందంపై స్టే విధించింది’ అని కోర్టు పేర్కొంది. ‘ఫస్ట్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్’ ఉందని, షాజహాన్‌ను అరెస్ట్ చేయాలని డివిజన్ బెంచ్ పేర్కొంది. షాజహాన్ పరారీలో ఉన్నందున పబ్లిక్ నోటీస్ జారీ చేయాలని కోర్టు తెలిపింది. షాజహాన్, అతని సహచరులు చేసిన అఘాయిత్యాలకు బాధితులైన సందేశ్‌ఖలీ మహిళల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలని రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థను ఆదేశించింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కి బృందం జనవరి 5న సందేశ్‌ఖలీకి వెళ్లి మాజీ మంత్రి ముల్లిక్‌తో పాటు సహ నిందితుడిగా ఉన్న రేషన్ స్కామ్‌కు సంబంధించి షాజహాన్ కోసం వెతుకుతోంది. జనవరి 16న కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జే సేన్‌గుప్తా బెంగాల్ పోలీసులు, సీబీఐతో సంయుక్త దర్యాప్తునకు ఆదేశించారు. ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై, దాని అధికారులపై దాడి జరిగిన కొన్ని రోజుల తరువాత, దర్యాప్తును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ఆదేశించారు. ఈ కేసును స్వతంత్రంగా దర్యాప్తు చేసేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ, రాష్ట్ర పోలీసులు ప్రధాన న్యాయమూర్తి టీఎస్ శివజ్ఞానం నేతృత్వంలోని డివిజన్‌లో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేసినట్లు సమాచారం. ఇదిలాఉండగా, ఆదివారం డైమండ్ హార్బర్ ఎంపీ అభిషేక్ బెనర్జీ షాజహాన్ అరెస్టులో జాప్యానికి న్యాయవ్యవస్థను తప్పుపట్టారు. ‘షేక్ షాజహాన్‌కు న్యాయవ్యవస్థ రక్షణ కల్పిస్తోంది. నేను దీన్ని రికార్డులు ఉంచాలనుకుంటున్నాను. తద్వారా సందేశ్‌ఖలీ వెలుగులో ఉంటుంది’ అని అభిషేక్ ఆదివారం ఒక కార్యక్రమంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ అన్నారు. ‘ తృణముల్ కాంగ్రెస్ పార్థ ఛటర్జీని, జ్యోతిప్రియ ముల్లిక్‌ను విడిచిపెట్టలేదు. షేక్ షాజహాన్ ఎవరు?’ అని ఆయన ప్రశ్నించారు. ‘జనవరి 5న ఈడీ బృందంపై ఆరోపించిన దాడి తర్వాత వారు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. కలకత్తా హైకోర్టు రాష్ట్ర పోలీసులు, సీబీఐ అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది’ అని అభిషేక్ అన్నారు. ‘కొన్ని రోజుల తర్వాత ఈడీ స్టే కోరింది. దానిపై హైకోర్టు మంజూరు చేసింది. హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. వారు రాష్ట్ర పోలీసుల చేతులు కట్టేశారు. మమతా బెనర్జీని కాదు.

ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్ కన్నుమూత

ముంబై: బాలీవుడ్‌లో గజల్, ప్లేబ్యాక్ సింగర్‌గా గుర్తింపు తెచ్చుకున్న పంకజ్ ఉదాస్ సోమవారం కన్నుమూశారు. 72 ఏళ్ల వయసున్న ఆయన చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఉదాస్ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు ఓ ప్రకటన విడుదల చేశారు. పంకజ్ ఉదాస్ కూతురు నయాబ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. దీర్ఘకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న పద్మశ్రీ పంకజ్ ఉదాస్ ఫిబ్రవరి 26న కన్నుమూశారు. చాలా భారమైన హృదయంతో ఈ విషయాన్ని తెలియజేస్తున్నామనిామె పేర్కొన్నారు. కాగా పంకజ్ ఉదాస్ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. బాగా ప్రజాదరణ సంపాదించిన పాటల్లో ‘చిట్టి ఆయీ హై’, ‘చండీ జైసా రంగ్ తేరా’, ‘తోడి తోడి పియా కరో’, ‘ఏక్ తరఫ్ ఉస్కా ఘర్’, ‘ఆజ్ జింకే కరీబ్ హోతే హై’ వంటి పాటలు ఉన్నాయి. పంకజ్ ఉదాస్ మరణవార్త విని అభిమానులు, సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా సంతాపం వ్యక్తం ప్రకటించారు. బాలీవుడ్ ప్రముఖ గాయకుడు సోనూ నిగమ్ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా సంతాపం తెలిపారు.

కార్తీ చిదంబరంపై ఈడీ చార్జిషీటు
హైకోర్టు తీర్పు రిజర్వు

న్యూఢిల్లీ: చైనీస్ వీసా కేసుకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ ఎంపీ కార్తి చిదంబరం, ఇతరులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన చార్జిషీటుపై తీర్పును ఢిల్లీ హైకోర్టు సోమవారం రిజర్వు చేసింది. మార్చి 16వ తేదీకి తీర్పును ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగపాల్ వాయిదా వేశారు. కార్తీ చిదంబరం, ఎస్.భాస్కరరామన్, కొంతమంది వ్యక్తులు, సంస్థల పేర్లను ఈడీ తన చార్జిషీట్‌లో చేర్చింది. ఈ కేసులో కార్తీ చిదంబరం గతంలో ముందస్తు బెయిలు కోసం హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణలో ఉన్నందున ఎలాంటి చర్యలకు పాల్పడబోమని ఈడీ తరఫున హాజరైన ఏఎస్‌జీ ఎస్వీ రాజు కోర్టుకు తెలిపారు. కార్తీ తరపు న్యాయవాది కపిల్ సిబల్ తన వాదన వినిపిస్తూ... నిందితుడు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఎలాంటి సమాచారం లేదన్నారు. ఆయన ఎలాంటి డబ్బులు తీసుకోలేదని, మనీ అన్నదే లేనప్పుడు లాండరింగ్ అనే మాటే ఉండదని అన్నారు. అయినప్పటికీ ఈసీఐఆర్ నమోదు చేశారని, నిందితుడు సైతం విచారణకు సహకరిస్తున్నారని కోర్టుకు వివరించారు. 2011లో లావాదేవీలు జరిగినట్టు ఆరోపిస్తూ కేసు రిజిస్ట్రేషన్ మాత్రం 2022లో చేశారని ఆయన వాదించారు. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పది రోజుల్లోనే ఈసీఐఆర్ నమోదైనందున కార్తీ అరెస్టుపై ఆందోళనలు ఉన్నాయన్నారు. లావాదేవీలు జరిగాయని చెబుతున్న మొత్తం రూ.50 లక్షలనీ, కోటి కంటే తక్కువని, వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని బెయిలు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఏఎస్‌జీ ఎస్వీ రాజు తన వాదన వినిపిస్తూ... కేసు విచారణ జరుగుతోందని, అసలు కేసు లేనప్పుడు అరెస్టు చేస్తారనే భయం నిందితులకు ఎందుకని ప్రశ్నించారు. ఇంతవరకూ ఎలాంటి సమన్లు ఇవ్వలేదని, కేవలం ఈసీఐఆర్ మాత్రమే నమోదు చేశామని, అందువల్ల అరెస్టు చేస్తారనే భయాలు సహేతుకం కాదని ఆయన పేర్కొన్నారు. దీంతో కార్తి చిదంబరం, ఎస్.భాస్కరరామన్, వికాస్ మఖరియా దాఖలు చేసిన మూడు అప్లికేషన్లను రౌస్ అవెన్యూ కోర్టు 2022 జూన్ 3న కొట్టివేసింది.

మరాఠా కోటా ఆందోళన ఉద్రిక్తం
ఇంటర్నెట్ సేవల నిలిపివేత

ముంబై: మనోజ్ జారంగే నేతృత్వంలో కొనసాగుతోన్న మరాఠా కోటా ఉద్యమం అనేకచోట్ల హింసాత్మకంగా మారుతోంది. జల్నాలోని ఓ ఆర్టీసీ బస్సుకు ఆందోళనకారులు నిప్పంటించారు. దీంతో శాంతిభద్రతలను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టిన పోలీసులు... జల్నాలోని కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. అటు ఎంఎస్ఆర్టీసీ కూడా స్థానికంగా బస్సు సేవలు నిలిపివేసింది. మరోవైపు జల్నా, ఛత్రపతి శంభాజీనగర్, బీడ్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిపివేసినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇవి అమల్లో ఉంటాయన్నారు. ముందుజాగ్రత్త చర్యగా ఈ మూడు జిల్లాల సరిహద్దులను మూసివేసినట్లు తెలిపారు. అంతర్వాలి సారథి గ్రామంలో నిరసన తెలుపుతున్న మరాఠా కోటా ఉద్యమనేత మనోజ్‌జారంగే... ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇంటికి ర్యాలీగా వెళ్తానని ప్రకటించడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. భారీ సంఖ్యలో ఆయన మద్దతుదారులు అంతర్వాలి సారథి గ్రామానికి చేరుకొనే అవకాశం ఉందని... అందుకే ఈ ఆంక్షలు అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఇదిలాఉంటే, తనను చంపడానికి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రయత్నిస్తున్నారని జల్నాలోని అంతర్వాలి సారథి గ్రామంలో ఆదివారం చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీశాయి.

జ్ఞానవాపి మసీదులో పూజలకు హైకోర్టు ఓకే

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని జ్ఞానవాపి మసీదు కేసులో వారణాసి జిల్లా న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సోమవారం అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. ఈ ప్రార్థనా మందిరం సెల్లార్‌లో పూజలు చేసుకునేందుకు హిందువులను అనుమతించేలా దిగువ న్యాయస్థానం ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను కొట్టివేసింది. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో గల కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలో ఉన్న జ్ఞానవాపి ప్రార్థనా మందిరం విషయంలో యాజమాన్య హక్కుల కోసం కొన్నేళ్లుగా వివాదం కొనసాగుతోంది. దీంతో మసీదు ప్రాంగణంలో ఉన్న దేవతామూర్తులను ఆరాధించడానికి అనుమతివ్వాలంటూ కొంతమంది మహిళలు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. దీనిపై గతంలో విచారణ జరిపిన వారణాసి కోర్టు... మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని ఉత్తర్వులిచ్చింది. అనంతరం సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీల్ చేసిన వాజూఖానా మినహా... మసీదు ప్రాంగణమంతా కార్బన్ డేటింగ్, ఇతర పద్ధతులతో భారత పురావస్తు విభాగం సర్వే చేసిన సంగతి తెలిసిందే. ఈ సర్వేలో కీలక విషయాలు బయటపడినట్లు హిందువుల తరపు న్యాయవాది విష్ణు శంకర్ జైన్ ఇటీవల తెలిపారు. మసీదు కింద హిందూ ఆలయానికి సంబంధించిన అవశేషాలున్నట్లు నివేదిక పేర్కొందన్నారు. ఈ నేపథ్యంలో ప్రార్థనా మందిరంలో సీల్ చేసిన బేస్‌మెంట్‌లో పూజలు చేసుకునేందుకు కొద్దివారాల క్రితం వారణాసి కోర్టు అనుమతినిచ్చింది. కాశీ విశ్వనాథ ఆలయానికి చెందిన అర్చకులతో పూజలు చేయించాలని కోర్టు సూచించినట్లు హిందూ మహిళల తరపు న్యాయవాది విష్ణు వెల్లడించారు.

సింహాలకు అక్బర్, సీత పేర్లు పెట్టిన అధికారిపై వేటు

అగర్తల: పశ్చిమ బెంగాల్‌లోని శిలిగుడి సఫారీ పార్కులో అక్బర్, సీత పేర్లు కలిగిన మగ, ఆడ సింహాలను ఒకే ఎన్‌క్లోజర్‌లో ఉంచడం ఇటీవల తీవ్ర వివాదానికి దారితీసింది. వాటికి ఆ పేర్లు పెట్టడంపై కలకత్తా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది కాస్తా దుమారం రేపడంతో త్రిపుర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు దిగింది. సింహాలకు ఆ పేర్లు పెట్టిన రాష్ట్ర అటవీ వ్యవహారాల ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రబిన్ లాల్ అగర్వాల్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జంతువుల మార్పిడి కార్యక్రమం కింద బెంగాల్ అధికారులు ఫిబ్రవరి 12న త్రిపురలోని సిపాహీజలా జూ పార్క్ నుంచి రెండు సింహాలను శిలిగుడి సఫారీ పార్కుకు తీసుకొచ్చారు. ‘అక్బర్’, ‘సీత’ పేర్లు కలిగిన ఆ మగ, ఆడ సింహాలను ఒకే ఎన్‌క్లోజర్‌లో ఉంచారు. దీనిపై విశ్వహిందూ పరిషత్ కలకత్తా హైకోర్టును ఆశ్రయించింది. రాష్ట్ర అటవీశాఖ అధికారులే వాటికి ఆ పేర్లు పెట్టారని, అవి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని ఆరోపించింది. సింహాలకు ఆ పేర్లు పెట్టడంపై బెంగాల్ ప్రభుత్వం స్పందిస్తూ.. త్రిపుర నుంచి తీసుకొచ్చేటప్పటికే వాటికి ఆ పేర్లు ఉన్నాయని, వాటిని మారుస్తామని కోర్టుకు తెలిపింది. ఈ వ్యవహారం వివాదాస్పదమవడంతో త్రిపుర ప్రభుత్వం చర్యలకు దిగింది. రాష్ట్ర వైల్డ్‌లైఫ్ చీఫ్‌గా ఉన్న అగర్వాల్‌ను వివరణ కోరగా... తాను ఆ పేర్లు పెట్టలేదని చెప్పారు. అనంతరం దర్యాప్తు చేపట్టగా బెంగాల్‌కు అప్పగించే సమయంలో డిస్పాచ్ రిజిస్టర్‌లో ఆయనే ఆ సింహాల పేర్లను అక్బర్, సీతగా నమోదు చేసినట్లు తెలిసింది. దీంతో అగర్వాల్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

రైతు, కార్మిక సంఘాల పిలుపు

డబ్ల్యూటీవో ప్రతిపాదనలపై వెల్లువెత్తిన నిరసనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: భారత రైతాంగానికి తీవ్ర నష్టం చేకూర్చే డబ్ల్యూటీవో ప్రతిపాదనలపై రైతు సంఘాల సమన్వయ సమితి, జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక అధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నిరసనలు వెల్లువెత్తాయి. దీనిలో భాగంగా విజయవాడ పాత బస్టాండ్ వద్ద ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు బైకు ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ లెనిన్ సెంటర్ వరకు సాగింది. అనంతరం అక్కడ జరిగిన సభలో ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ రైతాంగానికి మద్దతు ధర అమలు చేయొద్దని భారత ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్న డబ్ల్యూటీవో సమావేశాలను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోని రైతులు, కార్మికులందరూ సమైక్యంగా బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ సీనియర్ నాయకులు వై. కేశవరావు మాట్లాడుతూ రైతులు పండిస్తున్న అన్ని పంటలకు కనీస మద్దతు ధర చట్టం కేంద్ర ప్రభుత్వం తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో దడాల సుబ్బారావు, ఏ వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బుడ్డి రమేష్, ఏఐటీయూసీ నాయకులు మూలి సాంబశివరావు, ఎస్ సి హెచ్ శ్రీనివాస్, ఏఐఎఫ్టీయూ రాష్ట్ర కార్యదర్శి జే కిషోర్ బాబు, ఇఫ్టూ నేత ఎం రామకృష్ణ, హరినాథ్‌రెడ్డి ప్రసంగించారు. చివరిగా రైతు సంఘం అధ్యక్షులు మల్నీడి యలమందరావు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేఆర్ ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పే నరసింహారావు, యువజన కార్యదర్శి లంకా గోవిందరాజులు, పి వెంకటేశ్వరరావు వివిధ కార్మిక సంఘాల నాయకులు, రైతు సమన్వయ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఒంగోలులో వి. హనుమారెడ్డి , కార్యదర్శులు పి. జములయ్య గుంటూరు జిల్లా పెదకాకానిలో, జగన్నాథం కర్నూలులో, బుడితి అప్పలనాయుడు పార్వతీపురంలో, కోశాధికారి ఉలవలపూడి రాము నరసరావుపేటలో పాల్గొన్నారు.

కడపలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో నిరసన

కడపలో సీపీఐ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు పెద్దసంఖ్యలో ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీ రైతు సంఘం అధ్యక్షులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఒకపక్క మద్దతు ధర కల్పించాలని రైతులు ఆందోళన చేస్తుంటే, మరోపక్క దానిని వ్యతిరేకిస్తూ డబ్ల్యూటీవో ప్రతిపాదనలు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న మోదీ, మద్దతు ధర కోసం ఆందోళన చేస్తున్న రైతులపై కాల్పులు జరపడం ఆయన నియంతృత్వ ధోరణికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎస్.వెంకట శివ, సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, బజాకీర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి నాగసుబ్బారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎం.వి.సుబ్బారెడ్డి, పి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో...

రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెంలో పెద్దసంఖ్యలో ట్రాక్టర్లతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం సీహెచ్ కోటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు అడపా సుబ్బారావు, పి.చిన నరసింహం, కాళంగి ముత్యాలు, బాలాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో...

కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా కృష్ణాజిల్లా గన్నవరంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్నీడు యలమందరావు, జిల్లా నాయకులు ముక్కమాల ఉమామహేశ్వరరావు, శనగల సుబ్బారెడ్డి, కాట్రగడ్డ రామచంద్ర జోషి, కౌలు రైతు సంఘ నేత హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'సీటు' ఇచ్చాక సైకిలెక్కిన 'కొలుసు'

టీడీపీలో విచిత్ర పరిణామం

ఇదేం పద్ధతంటూ సీనియర్ల విస్మయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా ఆయా పార్టీల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థిత్వాలను ఆశించే నేతలు తమకు అవకాశం దక్కనప్పుడు పార్టీ మారడం ఆనవాయితీగా మారిన విషయం తెలిసిందే. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత కొలుసు పార్థసారథి పార్టీ మార్పు రాజకీయపార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. 2019 ఎన్నికల్లో పెనమలూరు నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా ఎన్నికైన ఆయనను ఈసారి ఆ పార్టీ అధిష్ఠానం పక్కనబెట్టింది. ప్రస్తుతం గృహ నిర్మాణశాఖ మంత్రిగా ఉన్న జోగి రమేశ్‌కు ఆ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించింది. దీంతో అలకబూనిన పార్థసారథి టీడీపీ అధిష్ఠానాన్ని ఆశ్రయించి, ఉమ్మడి కృష్ణాజిల్లా నూజివీడు నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయించుకున్నారు. కాని ఆయన టీడీపీ సభ్యత్వం తీసుకోకముందే అధినేత చంద్రబాబు ఈనెల 24న నూజివీడు నుంచి ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ జాబితా విడుదల చేశారు. తీరిగ్గా సోమవారం జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. విచిత్రమైన ఈ రాజకీయ పరిణామంపై పార్టీ శ్రేణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అనేక దశాబ్దాలుగా పార్టీ కోసం పనిచేస్తూ, అనేక కేసుల్లో ఇరుక్కుని ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొనే నాయకులను పట్టించుకోకుండా, పార్టీ సభ్యత్వం కూడా తీసుకోకముందే నిబంధనలకు విరుద్ధంగా టికెట్ ఇచ్చి తర్వాత పార్టీలోకి తీసుకోవడాన్ని సీనియర్ నేతలు విమర్శిస్తున్నారు. ఆరుసార్లు శాసనసభకు ఎన్నికై పార్టీ ఆవిర్భావం నుంచి ఉంటున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి వంటి సీనియర్ నేత పేరు సైతం తొలి జాబితాలో ప్రకటించకుండా, అసలు పార్టీలోనే చేరని కొలుసు పార్థసారథికి సీటు ఇవ్వాల్సిన అవసరం ఏముంది... టీడీపీలో చేరిన తర్వాత మలి జాబితాలో ప్రకటిస్తే ఇబ్బంది ఏముంటుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఇటువంటి ఏకపక్ష, అప్రజాస్వామ్యకర విధానాలను అధిష్ఠానం వీడాలని పార్టీ శ్రేణులు కోరుతున్నారు.

లోకేశ్ సమక్షంలో భవకుమార్, చంద్రశేఖర్ చేరిక

పార్థసారథితో పాటు వైసీపీ విజయవాడ నగర అధ్యక్షుడు బొప్పన భవకుమార్, కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఉండవల్లిలోని నివాసంలో ముగ్గురు నేతలకు పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రం తిరిగి అభివృద్ధి బాట పట్టాలంటే చంద్రబాబు ద్వారా మాత్రమే సాధ్యమని నమ్మి తాము పార్టీలో చేరుతున్నట్లు వారు పేర్కొన్నారు. పెనమలూరు నియోజకవర్గం నుంచి వల్లభనేని సత్యనారాయణ (ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్), నెరుసు రాజ్యలక్ష్మి (ఎంపీపీ-కంకిపాడు) ధూళిపూడి కృష్ణకిషోర్, రొండి కృష్ణా యాదవ్, మాడలి రామచంద్రారావు, లోయ ప్రసాద, లింగమనేని సత్యవేణి, పోలవరపు బొబ్బి, కొలుసు పోతురాజు, నిడుమోలు పూర్ణచంద్రరావు, కొడాలి రవి, మండవ ప్రగతి, నలి మాధవ్, దుద్దుకూరి వెంకటకృష్ణారావు, బోడపాడు శంకర్, తుపాకుల మహేశ్, పుప్పాల వెంకటసుబ్బారావు, మేకల విజయలక్ష్మి, చెన్ను సురేష్, ఇజ్జడ ప్రదీప్, ఉప్పులేటి అనిత, పొలిమెట్ల డానియేల్, నర్రా అరుణ్ బాబు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

భారత సంతతి ఇంజినీర్‌కు టెక్సాస్ అత్యున్నత అకడమిక్ అవార్డు

టెక్సాస్: భారత సంతతికి చెందిన ప్రముఖ కంప్యూటర్ ఇంజినీర్, ప్రొఫెసర్ అశోక్ వీరరాఘవన్‌కు టెక్సాస్ అత్యున్నత అకడమిక్ అవార్డు 'ఎడిత్ అండ్ పీటర్ ఓడన్నెల్' పురస్కారం దక్కింది. 'టెక్సాస్ అకాడమీ ఆఫ్ మెడిసిన్, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ' ఈ అవార్డును బహూకరించనుంది. ఆ రాష్ట్రంలో ఆయా రంగాల్లో ప్రతిభ చూపుతున్న ఔత్సాహిక పరిశోధకులకు ఈ సత్కారాన్ని అందజేస్తుంటారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ విభాగంలో చేసిన కృషికిగానూ వీరరాఘవన్‌కు ఈ పురస్కారాన్ని ప్రకటించారు. 'ఇమేజింగ్ సాంకేతికత'లో ఆయన చేసిన విప్లవాత్మక పరిశోధనలను గుర్తిస్తూ అవార్డును ప్రదానం చేశారు. చెన్నైలో పుట్టి పెరిగిన వీరరాఘవన్ ప్రస్తుతం రైస్ యూనివర్సిటీకి చెందిన జార్జ్ ఆర్.బ్రౌన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో 'ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్' విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని... రైస్ యూనివర్సిటీలోని కంప్యుటేషనల్ ఇమేజింగ్ ల్యాబ్‌లో చాలా మంది విద్యార్థులు, పోస్ట్‌డాక్టోరల్స్, రీసెర్చ్ సైంటిస్టులు గత దశాబ్ద కాలంగా చేసిన అద్భుతమైన, వినూత్న పరిశోధనలకు ఇది గుర్తింపు అని వీరరాఘవన్ అన్నారు. కాంతి ప్రసరించే మాధ్యమంలోని పరిమితుల వల్ల ప్రస్తుత ఇమేజింగ్ సాంకేతికతల విజువలైజేషన్ లక్ష్యం చేరుకోలేకపోతోందని.. దాన్ని పరిష్కరించే విషయంలో తమ పరిశోధనలు ఎంతో పురోగతి సాధించినట్లు పేర్కొన్నారు.

విఫల ప్రధాని మోదీ

- అధికారం కోసం బ్లాక్‌మెయిల్ రాజకీయాలు
- జగన్, చంద్రబాబు బీజేపీకి దాసోహం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: దేశాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్రాన్ని సీఎం జగన్ లక్షల కోట్ల అప్పుల్లో ముంచేశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. అనంతపురం జిల్లా కేంద్రం కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్‌తో కలిసి సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఓటర్లను ప్రభావితం చేసేందుకు మత విద్వేషాలు రెచ్చగొడుతున్నదని రామకృష్ణ మండిపడ్డారు. ప్రధాని మోదీ పక్కా బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. అందులో భాగంగానే ఎన్డీయే కూటమిలో చేరాలని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పై ఒత్తిడి చేస్తున్నారని, లేకపోతే జైలుకు పంపుతామని బెదిరిస్తున్నారని రామకృష్ణ చెప్పారు. ఈ పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమీ లేదనిన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో నిత్యావసర ధరలు తగ్గిస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని మోదీ... ధరలు తగ్గించారా...ఉద్యోగాలు ఇచ్చారా...ఆలోచించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని నమ్మబలికి...డిమాండ్ల సాధన కోసం ఢిల్లీ వస్తున్న రైతులపై కర్కశం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అన్నివిధాలా విఫలమైందన్నారు. బీజేపీ ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో ఉన్నారన్నారు. మరోసారి అధికారం చేపట్టాలని మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మంత్రులు, ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులను సైతం బెదిరిస్తున్నారని దుమ్మెత్తి పోశారు. కేజ్రీవాల్‌ను జైలుకు పంపుతామని బెదిరించడం మోదీ నియంతృత్వానికి నిదర్శనమన్నారు. ఇందుకు సీబీఐ, ఈడీ. ఐటీలను నిర్లజ్జగా ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌ను జైలుకు పంపారని గుర్తుచేశారు. ఢిల్లీ రూ.100 కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని ఆప్ నేతలను జైలుకు పంపిన మోదీ...పదేళ్లుగా సీఎం జగన్‌ను ఎందుకు జైలుకు పంపలేదని సూటిగా ప్రశ్నించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టులో బీజేపీ హస్తముందని, మోదీ, అమిత్ షాలకు తెలియకుండా చంద్రబాబును జగన్ అరెస్టు చేయగలరా అని నిలదీశారు. మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం, లౌకికరాజ్యం ప్రమాదంలో పడతాయని రామకృష్ణ తెలిపారు. భారత రాజ్యాంగాన్ని సైతం మారుస్తుందని హెచ్చరించారు. టీడీపీ, వైసీపీ సైతం మోదీకి దాసోహమంటున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి జగన్ సీఎం కావడం దౌర్భాగ్యమన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. దేశాన్ని ప్రగతి వైపు నడిపించడానికి విపక్షాలన్నీ ఏకమవుతున్నాయని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, కేశవరెడ్డి, నారాయణస్వామి, రమణ, సంతోశ్ కుమార్, రాజేశ్‌గౌడ్, కుల్లాయస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల రద్దుతో మరింత పారదర్శకత

ఆర్థిక వేత్త అమర్త్యసేన్

న్యూఢిల్లీ: ప్రముఖ ఆర్థిక వేత్త, నోబెల్ అవార్డు గ్రహీత అమర్త్యసేన్ సోమవారం ఎన్నికల బాండ్ల పథకం రద్దును స్వాగతించారు. ఈ పథకాన్ని ఒక కుంభకోణంగా అభివర్ణించారు. అమెరికాలోని మసాచుసెట్స్‌లో ఆయన పీటీఐతో మాట్లాడారు. ఈ చర్య ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో మరింత పారదర్శకతను తీసుకువచ్చేందుకు ఉపయోగపడుతుందని ఆశిస్తున్నానన్నారు. 'ఎన్నికల బాండ్లు ఓ కుంభకోణం... దాన్ని రద్దు చేసినందుకు సంతోషంగా ఉన్నాను' అని తెలిపారు. ఇటీవల సుప్రీం కోర్టు ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీం రద్దు చేసింది. స్కీమ్ రాజ్యాంగ విరుద్ధ మని పేర్కొంది. దాతలు, బాండ్‌ల విలువ తదితర సమాచారాన్ని అందు బాటులో ఉంచాలని ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. రాజకీయ విరాళాల్లో పారదర్శకత తీసుకురావడం, నల్లధనాన్ని అరికట్టడమే ఈ పథకం లక్ష్యమన్న కేంద్రం వాదనతో సర్వోన్నత న్యాయస్థానం ఏకీభవించలేదు.

కేంద్రానికి సుప్రీం కోర్టు అల్టిమేటం!

న్యూఢిల్లీ: కోస్ట్‌గార్డుకు చెందిన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు అల్టిమేటం జారీ చేసింది. శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలనే విషయంలో మహిళా అధికారుల అభ్యర్థనను వదిలేయలేమని సుప్రీంకోర్టు పేర్కొంది. కోస్ట్‌గార్డుకు చెందిన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్‌లో చోటు కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వంపై అసహనం వ్యక్తం చేశారు.

కోస్ట్ గార్డుకు చెందిన మహిళా అధికారులకు సంబంధించిన శాశ్వత కమిషన్‌ను ఇప్పటికీ ఎందుకు ఏర్పాటు చేయటం లేదని ప్రశ్నించారు. మీకు(కేంద్ర ప్రభుత్వం) ఏర్పాటు చేయటం చేతకాకపోతే చెప్పండి.. మేం ఏర్పాటు చేస్తాం అని పేర్కొన్నారు. కావున త్వరగా శాశ్వత కమిషన్‌లో మహిళా కోస్ట్ గార్డు అధికారులకు చోటు కల్పించాలని చీఫ్ జస్టిస్.. అటార్నీ జనరల్ ఆర్ వెంకటరమణీని ఆదేశించారు. ఈ విషయంలో అఫిడవిట్ దాఖలు చేయవల్సిందిగా కోస్ట్‌గార్డును కోరుతామని అటార్నీ జనరల్.. సుప్రీం కోర్టుకు తెలియజేశారు. అదేవిధంగా నేవి, ఆర్మీతో పోల్చితే కోస్ట్‌గార్డు భిన్నమైనదని అటార్నీ జనరల్ సుప్రీం కోర్టుకు తెలిపారు. ఈ పిటిషన్ తదుపరి విచారణను సుప్రీం కోర్టు మార్చి 1కి వాయిదా వేసింది.

పీపీబీఎల్ బోర్డుకు విజయ్ శేఖర్ శర్మ రాజీనామా

న్యూఢిల్లీ: సుపరిపాలన నిబంధనలు, రెగ్యులేటరీ నిబంధనల అమలులో విఫలం కావడంతో ఆర్బీఐ నిషేధాన్ని ఎదుర్కొంటున్న ప్రముఖ ఫిన్ టెక్ సంస్థ పేటీఎం పేరెంట్ సంస్థ వన్97 కమ్యూనికేషన్స్ ఫౌండర్ విజయ్ శేఖర్ శర్మ కీలక నిర్ణయం తీసుకున్నారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంకింగ్ లిమిటెడ్ (పీపీబీఎల్) బోర్డుకు విజయ్ శేఖర్ శర్మ రాజీనామా చేశారు. తాను రాజీనామా చేసిన విషయాన్ని రెగ్యులేటరీ సంస్థలకు తెలిపారు. ఇదిలా ఉండగా, పీపీబీఎల్ కు కొత్త చైర్మన్ ను నియమిస్తామని వన్97 కమ్యూనికేషన్స్ ఓ ప్రకటనలో తెలిపింది.

రాంచీ టెస్టు టీమిండియాదే

ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లాండ్ చిత్తు

సిరీస్ భారత్ వశం

రాంచీ: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా రాంచీలో జరుగుతున్న నాలుగో టెస్టు మ్యాచులో కూడా భారత్ అదరగొట్టింది. ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం అందుకుంది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3-1తో టీమిండియా కైవసం చేసుకున్నట్లయింది. నాలుగో రోజు భారత జట్టు ఇంగ్లండ్ జట్టుపై 152 పరుగుల దూరంలో నిలవగా ఈ లక్ష్యాన్ని సులభంగా ఛేదించింది. ఈ క్రమంలో టీమిండియా 5 వికెట్లు కోల్పోయి 192 పరుగులు చేసింది. ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్‌కు కఠిన సవాళ్లు ఎదురైన పరిస్థితుల్లో భారత యువ బ్యాటర్లు అద్భుత ప్రతిభ కనబర్చారు. ఇంగ్లాండ్ నిర్దేశించిన 192 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా ఐదు వికెట్లను కోల్పోయి విజయం సాధించింది. కెప్టెన్ రోహిత్ శర్మ (55), శుభ్‌మన్ గిల్ (52) అర్ధ సెంచరీలు సాధించగా... యశస్వి జైస్వాల్ (37), ధ్రువ్ జురెల్ (39) విలువైన పరుగులు చేశారు. రజత్ పటీదార్ , సర్ఫరాజ్ ఖాన్ డకౌట్లుగా పెవిలియన్‌కు చేరారు. రవీంద్ర జడేజా (4) ఎక్కువ పరుగులు చేయలేకపోయాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 3, టామ్ హార్ట్లీ, జోరూట్ చెరో వికెట్ తీశారు. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కీలక పరుగులు చేసిన ధ్రువ్ జురెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.

కొద్దిసేపు హడలెత్తించిన బషీర్...

ఓవర్ నైట్ 40/0 స్కోరుతో నాలుగో రోజు లక్ష్యఛేదనను ప్రారంభించిన టీమిండియా కాసేపు బాగానే ఆడింది. అయితే, యశస్వి జైస్వాల్ ఇచ్చిన క్యాచ్‌ను అండర్సన్ ముందుకు దూకి అందుకోవడంతో తొలి వికెట్‌కు 84 పరుగులు వచ్చాయి. మరోవైపు రోహిత్ శర్మ నిదానంగా ఆడుతూ స్కోరు బోర్డును నడిపించాడు. అయితే, హిట్‌మ్యాన్ కూడా అర్ధ సెంచరీ చేసిన కాసేపటికే ఔటయ్యాడు. భోజన విరామ సమయానికి 118/3 స్కోరుతో వెళ్లిన భారత్‌కు బ్రేక్ తర్వాత వచ్చీరాగానే భారీ ఎదురు దెబ్బ తగిలింది. షోయబ్ బషీర్ ఒకే ఓవర్‌లో రవీంద్ర జడేజా, సర్ఫరాజ్ ఖాన్‌ను ఔట్ చేశాడు. దీంతో ఒక్కసారిగా 120/5 స్కోరుతో నిలిచింది. ఈ సమయంలో మరొక వికెట్ పడి ఉంటే భారత్ పరిస్థితి భిన్నంగా ఉండేది. ఇంగ్లాండ్ స్పిన్నర్లు కట్టుదిట్టంగా బంతులేసినా... ధ్రువ్-శుభ్‌మన్ గిల్ పట్టుదల ప్రదర్శించారు. ఆరో వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యం నిర్మించి జట్టును విజయతీరాలకు చేర్చారు.

ధ్రువ్‌కు రోహిత్ ప్రశంస

టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ నాలుగో టెస్టు అనంతరం ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. యువ క్రికెటర్లు తమకొచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ఆనందంగా ఉందని.. సీనియర్లు మళ్లీ జట్టులోకి వచ్చినా మేం ఒత్తిడికి గురికాకుండా నిర్ణయం తీసుకొంటామని పేర్కొన్నాడు. కఠిన పరిస్థితులను ఎదుర్కొని అద్భుతంగా ఆడిన ధ్రువ్ జురెల్‌పై రోహిత్ ప్రశంసలు కురిపించాడు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA/042/2024-26, Phones : Editorial : 2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.